RNI No: TELTEL/2021/81803

Jai Bhavani
CITY PLANNERS
AutoDCR ONLINE, BUILDING PERMISSION, UP LOADING & Pre DCR, CAD DRAWINGS
LRS, BRS, FIRE NOC
BUILDING PLANS, CONSTRUCTIONS & INTERIOR DESIGN
Ph: 040-24141785, Cell: 9966405785
Email : citytimestd@gmail.com

# మెట్రో సిటీటైమ్స్

Jai Bhavani
CITY PLANNERS
AutoDCR ONLINE, BUILDING PERMISSION, UP LOADING & Pre DCR, CAD DRAWINGS
LRS, BRS, FIRE NOC
BUILDING PLANS, CONSTRUCTIONS & INTERIOR DESIGN
Ph: 040-24141785, Cell: 9966405785
Email : citytimestd@gmail.com

METRO CITY TIMES Telugu daily
తెలుగు దినపత్రిక

సంపుటి: 5 | సంచిక : 197 | రంగారెడ్డి | శుక్రవారం, ఏప్రిల్ 10, 2026 | పేజీలు : 8 | వెల : 2/-

# పొంగులేటి కాదు- పొంగు'లూటీ'

### -సరుకు లేనప్పుడు తిట్ల రాగాన్ని అందుకున్నారు.
### -అసెంబ్లీ సాక్షిగా సి ఎం, మైనింగ్ మంత్రి చెప్పింది తప్పా.
### -ప్రభుత్వ భూమి అయితే హైడ్రా ఎక్కడికి పోయింది.
### -సచివాలయం సాక్షిగా రాఘవ కన్స్ట్రక్షన్ మీద పొంగులేటి అబద్దాలు - మాజీ మంత్రి హరీష్ రావు



వనపర్తి, :అంబేద్కర్ సచివాలయం లో జరిగి న అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడిన పొగరు లేటి మాటలు అందరు విన్నామని ఒకవైపు అంబేద్కర్, మరొక వైపు అమ్మవారు, బిర్లా మందిరం సాక్షిగా రాఘవ కన్స్ట్రక్షన్ మీద నిజాలు దాటి అబద్దాలు మాట్లాడారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు.వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరం జన్ రెడ్డి, లక్ష్మా రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే లు అల వెంకటేశ్వర్ రెడ్డి, అంజయ్య యాదవ్, రాష్ట్ర నాయకులు ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, నాగం తిరుపతి రెడ్డి లతో కలిసి ఆయన మాట్లాడారు. పొంగులేటి కాదు పొంగు లూటి పొగరు లూటి బాంబ్ లేటి మైనింగ్ లూటి అని ఆయన ఎద్దేవా చేశారు. ఆయన మాటలను చూస్తుంటే అర్థం అవుతుందని సరుకు లేనప్పుడు తిట్ల రాగాన్ని అందుకున్నారన్నారని తెలిపారు.

రాఘవ కన్స్ట్రక్షన్ సంస్థ ను కాపాడు కోవాలని బయట పడాలని తాపత్రయం కనిపించింది తాను ఒక్కడే కాదు అందరు దొంగలని రాష్ట్ర ములోని అందరి కుంభ కోణాలు బయట పెట్టె ప్రయత్నం కనిపించిందని ఈ విషయాలంటిని పొంగులేటి కాదు పొంగుళూటి అని చెప్పకనే చెప్పాడన్నారు. అసెంబ్లీ సాక్షిగా రాఘవ కన్స్ట్రక్షన్ గురుంచి సి ఎం రేవంత్ రెడ్డీ చెప్పాడని మా అధికారులు గుర్తు పట్టారని పెనాలిటీ వేసాము అని శాసనసభలో చెప్పాడని , మైనింగ్ మంత్రి సైతం చెప్పాడని ఆయన వివరించారు. రెవిన్యూ, విద్యుత్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు రాఘవ క్రషర్ కు నోటీసులు ఇచ్చారని ఇవ్వని తప్పా లేకపోతే బాంబ్ లేటి పొగరులేటి చెప్పింది తప్ప అని ఆయన ప్రశ్నించారు.

రాఘవ కన్స్ట్రక్షన్ పైన అటు అసెంబ్లీ లో ఇటు అధికారులు చెప్పినప్పుడు ఇది నాది కాదు అని ఎందుకు చెప్పలేకపోయావు అని, 12 రోజులు తరువాత తమరికి గుర్తు కు వచ్చిందా అని మంత్రి పొంగులేటి ని ఆయన ప్రశ్నించారు. మైనింగ్ మీది కాకపోతే అక్కడ కాంగ్రెస్ జెండా, కంటెనర్ మీద రాఘవ కన్స్ట్రక్షన్ పేరు ఎందుకు ఉంది , మైనింగ్ శాఖ నోటీసులు ఇస్తే మీ అధికారి సంతకం పెట్టింది నిజం కాదా ఆ ఆధారాలను కదా తాను అసెంబ్లీ లో చూపించిందని ఆయన ప్రశ్నించారు. బి ఆర్ ఎస్ హయాంలో 2016 లో ఈ భూములను నిషేధిత జాబితా లో పెట్టి కాపాడింది తామేనని హైకోర్టు, డివిజన్ బెంచ్ లకు కంపెనీ లు పోతే కూడా ఈ భూములు సీలింగ్ భూములను అని తీర్పు వచ్చింది వాస్తవం కదా అని ఆయన గుర్తు చేశారు.

ఈ భూములు ప్రభుత్వ భూములని ప్రభుత్వం సుప్రీం కోర్టు లో వేసాము అని ప్రభుత్వం చెబుతుందని కదా మరి ఏ కె స్క్వేర్ వెనుక ఉన్నది మీ కొడుకు భాగస్వామి కాదా అని మరి ఎందుకు రోజుకు ఒక పేరు ఒకనాడు కోహినూర్, మరో రోజు శిల్ప, ఇలా రోజుకొక పేరు బోర్డు ఎందుకు మారుతుందని ఆయన ప్రశ్నించారు.

ప్రభుత్వం భూమిలో పేదలు ఇండ్ల నిర్మాణం చేపడితే రాత్రికి రాత్రే ఇండ్లు కూలగోడుతున్నారు కదా ఇంత అవినీతి కబ్జా జరిగిందని అటు అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డీ, మైనింగ్ మంత్రి వివేక్ లు ఇటు నాలుగు శాఖల అధికారులు చెబుతున్న ప్రభుత్వ భూమి అయితే ఎందుకు హైడ్రా ఎక్కడికి పోయిందని ఆయన ప్రశ్నించారు.

ప్రభుత్వ భూమి అయితే హైడ్రాను పంపించి ప్రభుత్వం నిజాయితీ నిరూపించుకోవాలని ఆయన సవాల్ విసిరారు. మైనింగ్ గురుంచి సి ఎం రేవంత్ రెడ్డీ, మంత్రి వివేక్, నాలుగు శాఖల అధికారులు చెప్పింది అబద్దమా లేకపోతే మంత్రి పొంగులేటి చెప్పింది అబద్ధమా మీ ప్రభుత్వం అధికారులు చెప్పింది అబద్దం అయితే అసెంబ్లీ లో అబద్దం అని చెప్పాలని లేకపోతే మీరు చెప్పింది అబద్దం అయితే అసెంబ్లీ సాక్షిగా ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి పొంగులేటి ని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

## నివాసాల జోలికి వెళ్లం..
# చెరువులను వదలం!

### - బంజారాలేక్, మామిడిపల్లి కుంటలను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



హైదరాబాద్ ):
ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం నగరంలోని పలు చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1లోని తాజ్ బంజారా లేక్ తో పాటు, శంషాబాద్ మండలం మామిడిపల్లిలో మాయమైన చెరువుల ఆక్రమణలపై ఆయన తీవ్ర స్థాయిలో స్పందించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్థానికులతో కలిసి ఆయన బంజారా లేక్ దుస్థితిని స్వయంగా పరిశీలించి ఆరా తీశారు.

ఒకప్పుడు మంచినీటి సరస్సుగా ఉన్న బంజారా లేక్ నేడు పూర్తిగా కలుషితమై దుర్గంధభరితంగా మారడం పట్ల కమిషనర్ రంగనాథ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులోకి నేరుగా మురుగునీరు చేరడం, ఎగువ నుంచి కొట్టుకువచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలతో చెరువు నగానికి పైగా నిండిపోవడాన్ని ఆయన గమనించారు. ఎఫ్‌టీఎల్ (FTL) పరిధిలోనే రోడ్డు నిర్మించడం, వ్యర్థాలను పారబోయడంతో చెరువు ఉనికికే ప్రమాదం ఏర్పడిందని, ఇది హైదరాబాద్‌లోనే అత్యంత కలుషితమైన జలవనరుగా మారిపోవడం విచారకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, కట్టమైసమ్మ దేవాలయానికి వెళ్లే దారిని తాజ్ బంజారా హోటల్ యాజమాన్యం మూసివేయడంపై భక్తులు చేసిన ఫిర్యాదులను ఆయన తీవ్రంగా పరిగణించారు.

బంజారాలేక్ పైభాగంలో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడి, దానిని పార్కుగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్.. నివాసాల జోలికి వెళ్లకుండానే చెరువును పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. నాలాలను మూసివేసి వరద ముప్పునకు కారణమయ్యే నిర్మాణాలపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చెరువు పునరుద్ధరణకు సంబంధించి సమగ్ర నివేదిక రూపొందిస్తామని, ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఎమ్మెల్యే దానం నాగేందర్ సహకారంతో అభివృద్ధి పనులు చేపడతామని వెల్లడించారు. ఫిర్యాదుదారులతో పాటు ఆక్రమణదారులను కూడా పిలిచి పారదర్శకంగా విచారణ జరుపుతామని ఆయన స్పష్టం చేశారు.

శంషాబాద్ మండలం మామిడిపల్లి పరిసరాల్లో నాలుగైదు చెరువులు మాయమయ్యాయంటూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపైనా హైడ్రా కమిషనర్ దృష్టి సారించారు. ఒంగోని కుంట, కనకయ్యకుంట, మర్రివాణికుంట, ఎర్రకుంట తదితర నీటి వనరులను పూర్తిగా ఆక్రమించడాన్ని ఆయన సీరియస్‌గా తీసుకున్నారు. ఈ చెరువులను కలిపే వరద కాలువలను ఇష్టానుసారంగా కబ్జా చేయడం, మూసేయడం వల్లే వర్షాకాలంలో వరద నీరు ఎటు వెళ్లాలో తెలియక స్థానిక కాలనీలు నీట మునుగుతున్నాయని గుర్తించారు.

మామిడిపల్లిలోని చెరువులు, వరద కాలువలపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో మాట్లాడి పూర్తి సమాచారం సేకరించాలని హైడ్రా అధికారులను కమిషనర్ ఆదేశించారు. ముందుగా ఆక్రమణదారులతో సమావేశం ఏర్పాటు చేసి కబ్జాలు తొలగించాలని సూచిస్తామని, వారు వినని పక్షంలో హైడ్రా నేరుగా రంగంలోకి దిగి చర్యలు చేపడుతుందని స్థానికులకు భరోసా ఇచ్చారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనతో చెరువుల కబ్జాదారుల్లో వణుకు మొదలైంది.

## బ్లూ బ్లాక్ గ్రీన్ షర్ట్స్ కవాతును విజయవంతం చేయండి


### :జూపల్లి కృష్ణారావు

### పిడమర్తి రవితో కలిసి గోడపత్రిక విడుదల చేసిన మంత్రి జూపల్లి



హైదరాబాద్, : ఏప్రిల్ 14న భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పిడమర్తి రవి గారి ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన బ్లూ బ్లాక్ గ్రీన్ షర్ట్స్ కవాతు విజయవంతం చేయాలని సంబంధించిన పోస్టర్ని ఎక్సైజ్ పర్యాటక మరియు సంస్కృతిక శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీల సంక్షేమం కోసం ప్రభుత్వం నిబద్ధత పనిచేస్తుందని అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగానే పది పేదవారికి ప్రజా ప్రభుత్వ పథకాలు అమలు చేస్తుందని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్ లో బషీర్ బాగ్ లో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించే బ్లూ బ్లాక్ గ్రీన్ కవాతు ను రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. పిడమర్తి రవి మాట్లాడుతూ ఏప్రిల్ 14న సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమయ్యే బ్లూ బ్లాక్ గ్రీన్ షర్ట్స్ కవాతును ప్రారంభిస్తున్నామని రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బివిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్, తెలంగాణ మహిళా జాగృతి అధ్యక్షురాలు కోటగిరి ఉషారాణి, నాయకులు దేవరకొండ నరేష్, బీఎస్ఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మొగిలిగిద్ద ప్రసాద్, రమేష్, ఆసిఫ్, మల్లికార్జున్, మల్లేష్, రాజలింగం తదితరులు పాల్గొన్నారు

# పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం



మహేశ్వరం : మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోడౌన్ లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం పేదలకు ఉచితంగా సన్న బియ్యం అందించి కడుపు నింపుతుంది. అలాంటి రేషన్ బియ్యాన్ని దళారులు పక్కదారి పట్టించి కోట్లు సంపాదిస్తున్నారు. పేదలకు అందాల్సిన రేషన్ దళారుల చేతుల్లోకి వెళ్తుంది. బాలాపూర్ పోలీసులు ,సివిల్ సప్లైస్ అధికారులు కలిసి బాలాపూర్ పోలీస్ పరిధిలోని సుల్తాన్‌పూర్ ప్రాంతంలో అక్రమ గోదాంపై దాడి నిర్వహించారు.

ఈ దాడిలో పోలీసులు 523 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, 69 క్వింటాళ్ల గోధుమలను స్వాధీనం చేసుకున్నారు.ఈ రేషన్‌ను అక్రమంగా నిల్వ ఉంచి, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌కు నష్టం కలిగిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఆపరేషన్‌లో జిల్లా సివిల్ సప్లైస్ అధికారి



వనజాత, ఏఎస్ఓ రాజేంద్రనగర్ వి. పుల్లయ్య, సివిల్ ఇన్స్పెక్టర్ మహేష్ పాల్గొన్నారు. బాలాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

మెట్రో సిటీటైమ్స్

శుక్రవారం, ఏప్రిల్ 10, 2026

# హస్తినకు దీదీ...

ఈ దేశంలో మహిళా ప్రధానమంత్రిగా ఏకైక నాయకురాలు ఇందిరా గాంధీ ఉండేవారు. ఆమె ఐరన్ లేడీగా బలమైన ముద్ర వేసుకున్నారు. పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ మరోసారి అధికారంలోకి తీసుకురావాలని మమతా బెనర్జీ కాళ్లకు చక్రాలు కట్టుకొని తిరుగుతున్నారు. ఆమెను ఎలాగైనా అధికారంలో నుంచి దించి కాషాయపు జెండా ఎగరేయాలని బీజేపీ ప్రతి వ్యూహాలతో ప్రయత్నాలు చేస్తోంది1966 నుంచి 1977 దాకా ఏకంగా 11 ఏళ్ళ పాటు కంటిన్యూస్ గా దేశాన్ని పాలించిన ఇందిర బలమైన నాయకురాలిగా జాతీయంగా అంతర్జాతీయంగా ఎదిగారు. ఇక 1980 నుంచి 1984లో మరణించేంతవరకు మరో అయిదేళ్ల పాటు ప్రధానిగా పాలించారు. మొత్తంగా 16 ఏళ్ల పాటు దేశాన్ని ఇందిరాగాంధీ ఏలారు. ఆమె తరువాత మరో మహిళ ఈ దేశంలో ప్రధాని పీఠం ఎక్కలేదు. అయితే ఇపుడు ఒక మహిళా నేత పేరు ఈ పదవి కోసం గట్టిగా వినిపిస్తోంది. ఆమె ఎవరో కాదు బెంగాల్ ప్రజల చేత దీదీ అని పిలిపించుకుని ముమ్మారు పశ్చిన బెంగాల్ కి ముఖ్యమంత్రిగా పనిచేసి వరుసగా నాలుగవ సారి గెలిచి రికార్డు బద్ధలు కొట్టాలని చూస్తున్న తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ. బెంగాల్ లో ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తృణమూల్ కాంగ్రెస్ కీలక నేత అభిషేక్ బెనర్జీ ఒక సభలో మాట్లాడుతూ పాకిస్తాన్ ని ఉద్దేశించి హెచ్చరికలు జారీ చేశారు. కోల్ కటా మీదకు వస్తామని ఇళ్లలో దాడి చేస్తామని పాక్ పాలకులు అంటున్నారని కానీ తామే పాకిస్తాన్ మీదకు వెళ్ళి వారి సంగతి తేలుస్తామని వార్నింగ్ ఇచ్చారు. మమతా బెనర్జీ ఇండియా కూటమి తరఫున కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తరువాత ఇది తప్పకుండా జరుగుతుందని ఆయన స్పష్టంగా చెప్పారు. దీనిని బట్టి చూసిన వారు మమత ఇండియా కూటమి తరఫున ప్రధాని అభ్యర్థిగా ముందుకు వస్తున్నారా అన్న చర్చిస్తున్నారు.మూడు సార్లు బెంగాల్ సీఎం గా ఉన్న మమత 2026 ఎన్నికల్లో కనుక గెలిస్తే 2029 నాటికి ఆమె జాతీయ రాజకీయాల్లోకి వస్తారు అన్న చర్చ సాగుతోంది. మమత చూపు అపుడు ఢిల్లీ మీదనే ఉంటుందని అంటున్నారు. ఆ మాటకు వస్తే చాలా కాలంగా మమత జాతీయ రాజకీయల మీద ఆసక్తిగా ఉన్నారని అంటున్నారు. ఇక ఇండియా కూటమిలో కాంగ్రెస్ పెద్ద పార్టీగా ఉంది. ఆ తరువాత తృణమూల్ కాంగ్రెస్ ఉంటుంది. అందులో మరో బలమైన పార్టీగా డీఎంకే ఉన్నా కూడా సీనియారిటీ అనుభవం అన్నీ కలసి మమత ఇండియా కూటమి నాయకత్వాన్ని కోరుకుంటారు అని అంటున్నారు. బెంగాల్ లో విజయం తరువాత ఆమె ఇండియా కూటమి బాధ్యతలు తీసుకుని మోడీ సర్కార్ మీద గట్టిగా పోరాడుతారు అని అంటున్న ఇక మహిళా రిజర్వేషన్ అన్నది 2029 ఎన్నికల్లో గెలిచేందుకు తమ పార్టీకి ట్రంప్ కార్డు అవుతుందని బీజేపీ భావిస్తోంది కానీ అదే సమయంలో దేశంలో లోక్ సభ సీట్లు 840 దాకా పెరిగితే మాత్రం అందులో మూడవ వంతు మహిళా ఎంపీలే ఉంటారు అన్నది మరచిపోరారు. అలా లెక్క తీస్తే 280 దాకా ఎంపీ సీట్లు మహిళలకు దఖలు పడతాయి. దాంతో మహిళలు కూడా ప్రధాని పీఠం మీద గురి పెట్టేందుకు అవకాశాలు అధికం అవుతాయని అంటున్నారు. ఇక ఇండియా కూటమిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నా కూడా లీడ్ తీసుకుని బీజేపీ మీద పోరాటానికి మమత సిద్ధం అవుతారు అని అంటున్నారు.

ఇండియా కూటమి నుంచి రేసులో : ఆ విధంగా డైనమిక్ లీడర్ షిప్ ని ఆమె ఇస్తారని తృణమూల్ కాంగ్రెస్ వర్గాలు అంటున్నారు. 292 సీట్లు ఉన్న పశ్చిమబెంగాల్‌లో మాట్రిజ్ ఓ సర్వే నిర్వహించింది. ఇందులో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇక్కడ పోటీ అంచనాలు అందనంతగా ఉంది. తాజా సర్వేలో పార్టీలే షేక్ అయ్యే అభిప్రాయాలు ప్రజలు చెప్పారు. ఈ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ 43 శాతం ఓట్లతో 140 నుంచి 160 సీట్లను గెలుచుకోగలదు. ప్రతిపక్ష భారతీయ జనతాపార్టీ 41 శాతం ఓట్లతో 130 నుంచి 150 సీట్లు గెలుచుకుంటుంది. రాష్ట్రంలోని ఇతర పార్టీలు 16 శాతం ఓట్లతో 8 నుంచి 16 సీట్లు గెలుచుకోగలవు. పశ్చిమ బెంగాల్‌లో 148 సీట్లు గెలుచుకున్న పార్టీ అధికారంలోకి వస్తుంది. ఈ అభిప్రాయ సేకరణలో టీఎంసీకి 2 శాతం స్వల్ప ఆధిక్యం ఉన్నప్పటికీ ఈ తేడా చాలా తక్కువగా ఉండటంతో ఎన్నికల చిత్రం ఏ క్షణంలోనైనా మారిపోవచ్చు. మమత తరువాత కీలక హోదాలో పార్టీలో ఉన్న అభిషేక్ బెనర్జీ ఈ వ్యాఖ్యలు చేశారు అంటే మమత కచ్చితంగా కాబోయే ప్రధానిగా ఇండియా కూటమి నుంచి రేసులో ఉంటారు అన్నది స్పష్టం అవుతోంది. ఇతర ప్రాంతీయ పార్టీల మద్దతు ఉంటే ఇండియా కూటమి సారధ్యం ఆమెకు దక్కడం కూడా కష్టమేమీ కాదు, మొత్తానికి ఇవన్నీ ఆలోచించే అభిషేక్ బెనర్జీ ఈ కామెంట్స్ చేసి ఉంటారని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# కర్రెగుట్టలు మావోయిస్టుల రహిత ప్రాంతం

## అభివృద్ధి భద్రతే లక్ష్యం: డిజిపి శివధర్ రెడ్డి



హైదరాబాద్ : ప్రకృతి సౌందర్యానికి నిలయమైన ములుగు జిల్లాలోని కర్రెగుట్టల ప్రాంతం ఇప్పుడు మావోయిస్టుల ప్రభావం లేని ప్రశాంత ప్రాంతంగా అవతరించిందని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి వెల్లడించారు. జిల్లాలో పర్యటించిన ఆయన పామునూరు వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి గిరిజన ప్రాంతాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ. కర్రెగుట్టలపై మావోయిస్టుల ప్రభావం పూర్తిగా శూన్యమైందని, ప్రభుత్వం మరియు పోలీసు యంత్రాంగం ఎల్లవేళలా గుత్తికోయ ప్రజలకు అండగా ఉంటూ వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. ప్రజల ఉపాధి అవకాశాలను పెంచే దిశగా పామునూరుకు చెందిన ఏడు కుటుంబాల ఉమ్మడి జీవనోపాధి కోసం ఒక ఆటో, ఒక ద్విచక్ర వాహనాన్ని అందజేయడంతో పాటు వారికి అవసరమైన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అటవీ సంపద, ప్రకృతి అందాలతో అలరారుతున్న కర్రెగుట్టలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని ఆయన తెలిపారు. పర్యాటకులకు పూర్తి భద్రత కల్పించే లక్ష్యంతో పోలీస్ ఔట్‌పోస్ట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. పాలనలో పారదర్శకత మరియు వేగవంతమైన అభివృద్ధి కోసం అటవీ, రెవెన్యూ, సీఆర్పీఎఫ్ మరియు పోలీస్ శాఖల మధ్య సమన్వయాన్ని పెంచేందుకు ప్రత్యేక సమన్వయ కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. అనంతరం వెంకటాపురం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా "అరైవ్ అలైవ్" అవగాహన కార్యక్రమానికి డిజిపి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుమారు 3,000 మంది పాల్గొన్న ఈ సభలో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను తప్పకుండా పాటించాలని, ప్రాణాల కంటే విలువైనది మరేదీ లేదని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 200 మంది వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేసి, పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి వారి ఆరోగ్య భద్రతపై ఆరా తీశారు. డిజిపి బి. శివధర్ రెడ్డి పామునూరులోని సీఆర్పీఎఫ్ 39వ బెటాలియన్ ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్‌ను సందర్శించి అక్కడ విధుల్లో ఉన్న జవాన్లతో ముఖాముఖి మాట్లాడారు. మారుమూల ప్రాంతాల్లో వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని ప్రశంసించారు. కర్రెగుట్టలు వంటి కొండ ప్రాంతాల్లో వ్యూహాత్మక పట్టు సాధించడానికి మరియు ప్రాంతాన్ని మావోయిస్టు రహితంగా కొనసాగించడానికి రాష్ట్ర పోలీస్ మరియు సీఆర్పీఎఫ్ బలగాల మధ్య నిరంతర సమన్వయం అవసరమని ఆయన స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్ సమన్వయంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో పీసీసీఎఫ్ సువర్ణ, గ్రేహౌండ్స్ అదనపు డిజిపి అనిల్ కుమార్, ఎస్ఐబి ఐజిపి సుమతి, సీఆర్పీఎఫ్ ఐజీ విక్రమ్, ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్ తదితరులు పాల్గొన్నారు.

# సేఫ్ మదర్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహణ

కరీంనగర్ : ప్రజాపాలన ప్రగతి పథకాలలో భాగంగా సేఫ్ మదర్ డే కార్యక్రమం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి జీజీహెచ్ లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజీ మరియు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు. అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ. గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణ ప్రతి కుటుంబం మరియు సమాజం యొక్క బాధ్యత అని పేర్కొన్నారు. తల్లి ఆరోగ్యం బాగుంటేనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ. గర్భిణీలు గర్భధారణ సమయంలో నిర్దిష్టంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, సమతుల్య పోషకాహారం తీసుకోవాలని, వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు. ప్రభుత్వము గర్భిణీ స్త్రీల మరియు శిశువుల ఆరోగ్య రక్షణ కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పద్మజ మాట్లాడుతూ. గర్భిణీలకు సురక్షిత మాతృత్వం, ప్రసూతి ముందు మరియు తరువాత తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ వీరారెడ్డి, డి డబ్ల్యు ఓ. సరస్వతి, పిఓఎం హెచ్ న్ డాక్టర్ సన, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, గర్భిణీ స్త్రీలు, తల్లులు మరియు ఇతర ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంట్లో కుస్తీ.. బయట దోస్తీ..



తిరువనంతపురం : కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం పతాక స్థాయికి చేరింది. బీజేపీ అగ్రనేతలు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. తాజాగా ఎర్నాకుళంలో జరిగిన భారీ బహిరంగ సభలో అమిత్ షా పాల్గొన్నారు. కేరళలో దశాబ్దాలుగా మారుతూ వస్తున్న ఎల్‌డీఎఫ్ యూడీఎఫ్ పాలనలకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని అమిత్ షా పిలుపునిచ్చారు. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలు కేరళ వెలుపల దోస్తీ చేస్తూ, రాష్ట్రంలో మాత్రం ప్రజలను మభ్యపెట్టడానికి కుస్తీ పడుతున్నాయని ఆయన విమర్శించారు. ఈ రెండు కూటములు క్రమంగా క్షీణిస్తున్నాయని, కేరళ అభివృద్ధి కేవలం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీయేతోనే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. కేరళలోని సున్నితమైన అంశాలను ప్రస్తావిస్తూ, శబరిమల అయ్యప్ప దేవాలయం విషయంలో కమ్యూనిస్టు ప్రభుత్వం అనుసరించిన తీరును అమిత్ షా తీవ్రంగా తప్పుబట్టారు. దేవాలయంలో జరిగిన బంగారు ఆభరణాల చోరీ వ్యవహారంలో నిందితులను కాపాడే ప్రయత్నం జరుగుతోందని, భక్తుల మనోభావాలను ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఆయన ఆరోపించారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం భక్తుల పక్షాన ఉంటుందని, దోషులను విడిచిపెట్టే ప్రసక్తే లేదని హామీ ఇచ్చారు. అలాగే కేంద్ర పథకాలకు పేర్లు మార్చి తమవిగా ప్రచారం చేసుకుంటున్న ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీరును ఆయన ఎండగట్టారు. ఈ సభలో అమిత్ షాతో పాటు కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఆంధ్రప్రదేశ్ బీజేపీ సీనియర్ నేత , జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. అమిత్ షాకు ఘనస్వాగతం పలికిన విష్ణువర్ధన్ రెడ్డి, హోంమంత్రితో వేదిక పంచుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. కేరళలోని స్థానిక రాజకీయ పరిస్థితులు, ఎన్నికల ప్రచార సరళిపై అమిత్ షా ఆయనతో ప్రత్యేకంగా చర్చించారు. రాబోయే నాలుగు రోజులు ప్రచారాన్ని మరింత ఉధృతం చేయాలని, ఇంటింటికీ వెళ్లి మోదీ ప్రభుత్వ విజయాలను వివరించాలని అమిత్ షా దిశానిర్దేశం చేసినట్లు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ బహిరంగ సభ ఎర్నాకుళం , పరిసర నియోజకవర్గాల్లో బీజేపీ కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ముఖ్యంగా క్రైస్తవ, హిందూ ఓటర్లను ఆకట్టుకునేలా అమిత్ షా చేసిన ప్రసంగం వ్యూహాత్మకంగా ఉందని భావిస్తున్నారు. ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ పాలనల వల్ల కేరళ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వస్తోందని అమిత్ షా చేసిన వ్యాఖ్యానాలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ కింగ్ మేకర్ గా అవతరిస్తుందని ఆ పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

# ప్రేమ, పెళ్లిళ్లకు పేరెంట్స్ అనుమతులు

గాంధీనగర్ : గుజరాత్‌లో ఇకపై ప్రేమ వివాహం చేసుకోవడం అంత సులువు కాదు. ఇంట్లో తెలియకుండా పెళ్లి చేసుకుని, ఆ తర్వాత రిజిస్ట్రేషన్ చేయించుకుందామనుకునే ప్రేమికులకు గుజరాత్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. వివాహ రిజిస్ట్రేషన్ చట్టానికి చేసిన తాజా సవరణల ప్రకారం, పెళ్లి చేసుకోబోయే జంట తాము ఈ విషయాన్ని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామో లేదో అధికారికంగా ప్రకటించాల్సి ఉంటుంది. అంతేకాదు, వారి ఆధార్ కార్డులు, ఫోన్ నంబర్లు , అడ్రస్ వివరాలను రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించడం తప్పనిసరి చేశారు. ఈ కొత్త నిబంధనల్లో అత్యంత కీలకమైన అంశం తల్లిదండ్రులకు నోటీసు . జంట దరఖాస్తు చేసుకున్న 10 వర్కింగ్ డేస్‌ల్లో, రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి వారి తల్లిదండ్రులకు వాట్సాప్, ఎస్సెమ్మెస్ లేదా రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా సమాచారం వెళ్తుంది. అంటే, ఇంట్లో చెప్పకుండా పెళ్లి చేసుకోవాలనుకునే వారి గుట్టును ప్రభుత్వమే నేరుగా తల్లిదండ్రులకు విప్పుతుందన్నమాట. సనాతన సంప్రదాయాలను రక్షించేందుకు , మోసపూరిత వివాహాలు అంటే లవ్ జిహాద్ వంటివి అరికట్టేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు గుజరాత్ హోం మంత్రి హర్ష్ సంఘ్వి చెబుతున్నారు. మరో ముఖ్యమైన మార్పు 30 రోజుల వెయిటింగ్ పీరియడ్ . దరఖాస్తు చేసుకున్న వెంటనే పెళ్లి సర్టిఫికేట్ రాదు. కనీసం 30 రోజుల పాటు వేచి ఉండాలి. ఈ గడువులోగా పెళ్లికి సంబంధించి ఎవరైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తే, వాటిని అధికారులు పరిశీలిస్తారు. అలాగే, పెళ్లి ఫోటోలు, వివాహ ఆహ్వాన పత్రిక , సాక్షుల వివరాలను కూడా ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీనివల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, ఈ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మైనార్టీ దాటినా తమకు నచ్చిన వారిని పెళ్లి చేసుకునే స్వేచ్ఛను ఈ చట్టం హరిస్తోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని హక్కుల కార్యకర్తలు విమర్శిస్తున్నారు. తల్లిదండ్రుల ప్రమేయం పెంచడం వల్ల ప్రేమ జంటలపై దాడులు , వేధింపులు పెరిగే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఈ ముసాయిదాపై ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్న ప్రభుత్వం, త్వరలోనే దీనిని పూర్తిస్థాయి చట్టంగా అమలు చేయనుంది.

# జాగృతి లో చేరిన నడిగడ్డ పోరాట సమితి నేత రంజిత్ కుమార్

హైదరాబాద్ : నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్ బుధవారం నాడు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో తెలంగాణ జాగృతిలో చేరారు. అంతకుముందు అయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఆశయాలు విస్మరించబడ్డాయని, కాంగ్రెస్ పాలనలో పరిస్థితులు మరింత దిగజారాయని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల హక్కుల సాధన కోసం కవిత గారి నాయకత్వంలో ముందుకు సాగాలని తమ నడిగడ్డ హక్కుల పోరాట సమితి నిర్ణయించుకుందని తెలిపారు.

# ఆసుపత్రిలో చలి వేంద్రం ప్రారంభం

పటాన్ చెరు : గత ఎనిమిది సంవత్సరాలుగా వేసవిలో ఏర్పాటు చేస్తూ బాటసారులకు బాసటగా నిలుస్తున్న చలి వేంద్రాన్ని మాద్రి పృథ్వీరాజ్ ప్రారంభించారు. పటాన్ చెరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఎండీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలి వేంద్రం ఏర్పాటు చేయబడింది. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు మరియు ప్రజలు ఎండ తీవ్రతలో ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ సేవా కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ హైమావతి, ఆసుపత్రి సిబ్బంది, ఎండీ ఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# రైల్వే బ్రిడ్జి నిర్మాణం.. బ్లాక్ బ్రిడ్జిలో ఇరుక్కున్న కార్మికులు

సిర్పూర్ కాగజ్ నగర్ : సిర్పూర్ కాగజ్నగర్లో ఘోర ప్రమాదం జరిగింది. నిర్మాణంలో ఉన్న రైల్వే బ్లాక్ బ్రిడ్జ్లో కార్మికులు ఇరుక్కున్నారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ మండలం పెద్దవాగు రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా నిర్మిస్తున్న బ్లాక్ బ్రిడ్జ్లో ఇద్దరు కార్మికులు ఇరుక్కున్నారు. తొటి సిబ్బంది ఒక కార్మికుడిని ఆసుపత్రికి తరలించారు. బ్రిడ్జి కింద ఇరుక్కున్న మరో కార్మికుడికి ఘటనా స్థలంలోనే చికిత్స అందిస్తున్నారు.

# తమిళనాడు ఎన్నికల్లో కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్‌గా రేవంత్

హైదరాబాద్ : తమిళనాడు ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ తరఫున సీఎం రేవంత్‌రెడ్డి స్టార్ క్యాంపెయినర్‌గా పాల్గొననున్నారు. కాంగ్రెస్ తరఫున ఆయన్ను స్టార్ క్యాంపెయినర్‌గా ఏఐసీసీ ప్రకటించింది. విడుదల చేసిన స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో తెలంగాణ నుంచి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి లనూ చేర్చింది. కాగా..తమిళనాడులో తెలుగువారి సంఖ్య ఎక్కువగానే ఉన్న నేపథ్యంలో అక్కడ సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉంటే తమిళనాడులో డీఎంకేతో కలిసి కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తోంది. పొత్తులో భాగంగా మొత్తం 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆ పార్టీ పోటీ చేస్తుండగా..అందులో 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు సీనియర్ పరిశీలకుడిగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఏఐసీసీ నియమించింది.

# ఆల్మాస్ పేట సర్కిల్ పేరును మార్చడం ఓటు బ్యాంకు రాజకీయమే

కడప: కడప నగరంలోని ఆల్మాస్ పేట సర్కిల్ పేరును టిప్పు సుల్తాన్ సర్కిల్‌గా మార్చే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ, ఈరోజు బిజెపి యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి బొమ్మన విజయ్ ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్ గారిని కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బొమ్మన విజయ్ మాట్లాడుతూ ఆల్మాస్ పేట పేరును మార్చాల్సిన అవసరం మునిసిపల్ కార్పొరేషన్‌కు ఏముందని ప్రశ్నించారు. కేవలం ఒక వర్గం ఓట్ల కోసం, వివాదాస్పద వ్యక్తుల పేర్లను కూడళ్లకు పెట్టడం ద్వారా నగరంలో అశాంతి కలిగించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధిని గాలికొదిలేసి ఇలాంటి అనవసరపు నిర్ణయాలు తీసుకోవడం తగదని, ఈ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోకపోతే బిజెపి ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# నెరవేర్చని హామీలపై రాజీనామా ఆలోచనలో ఎమ్మెల్యే ఆది

కడప : జమ్మలమడుగులో మన ఊరు మన జెండా వేడుకల సందర్భంగా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డిమాట్లాడుతూ, గండికోట జలాశయం వల్ల నిరాశ్రయులైన వారికి వాగ్దానం చేసిన నష్టపరిహారం, ఉద్యోగాలు ఇవ్వకపోవడమే ప్రధాన ఆందోళన అని డ్డి అన్నారు. తన నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైనందుకు అసంతృప్తి వ్యక్తం చేశారు. తన శాసనసభ పదవికి రాజీనామా చేసే అవకాశం ఉందని కూడా ప్రకటించారు. కడప జిల్లా జమ్మలమడుగులో జరిగిన 'మన ఊరు మన జెండా ' వేడుకల సందర్భంగా కాషాయ జెండా ఎగురవేసిన అనంతరం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, వివిధ కారణాల వల్ల తన ఓటర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయానని పేర్కొన్నారు. గండికోట జలాశయం వల్ల నిరాశ్రయులైన వారికి వాగ్దానం చేసిన నష్టపరిహారం, ఉద్యోగాలు ఇవ్వకపోవడమే ప్రధాన ఆందోళన అని ఆయన తెలిపారు. "బాధితులు అనేకసార్లు విజ్ఞప్తి చేయడం , నేను వారి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాను ," అని ఆయన అన్నారు. అదేవిధంగా, రాజోలి ప్రాజెక్ట్ మరియు శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్ (ఎస్ఆర్బిసి) కారణంగా స్థానభ్రంశం చెందిన గ్రామస్థుల భవితవ్యంపై, అలాగే రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ (ఆర్ టి పిపి) వద్ద స్థానికులకు లభించే ఉద్యోగ అవకాశాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తన నియోజకవర్గ ప్రజలకు న్యాయం అందించడంలో వ్యవస్థ నుంచి మద్దతు లేకపోవడంతో తాను నిస్సహాయంగా ఉన్నానని ఆదినారాయణ రెడ్డి అన్నారు.

# కోహెడ అంగన్వాడి 2 కేంద్రం లో ఆరోగ్యలక్ష్మి కమిటీ సమావేశం

## - ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ బందెల సుజాత

కోహెడ : సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని అంగన్వాడి 2 కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్ పర్సన్ గా సర్పంచ్ బందెల సుజాత-బాలకిషన్ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సర్పంచ్ బందెల సుజాత మాట్లాడుతూ. గర్భిణీ స్త్రీలు బాలింతలు ఎలాంటి పోషక ఆహార లోపాలు లేకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్నటువంటి ఆరోగ్యలక్ష్మి పథకాన్ని వినియోగించుకోవాలని సమయానికి వచ్చి ఆరోగ్య లక్ష్మి పథకాన్ని గర్భణీలు బాలింతలు వినియోగించుకోవాలని కోరారు. తర్వాత పిల్లలకు అన్న ప్రసన్న నిర్వహించడం జరిగింది. తర్వాత అంగన్వాడి కేంద్రం నుండి ప్రైమరీ స్కూల్ కి వెళ్తున్నటువంటి ముగ్గురు విద్యార్థినులకు ప్రోగ్రాస్ కార్డులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోహెడ గ్రామ సర్పంచ్ బందెల సుజాత, అంగన్వాడి కేంద్రం 2 టీచర్ జి. విజయ, ఆయా బందెల లక్ష్మి, ఆరోగ్యలక్ష్మి కమిటీ సభ్యుడు సామాజిక కార్యకర్త డా. వేల్పుల శంకర్, టీచర్ దర్శనాల నారాయణ, సిపి హేమలత, ఆశా వర్కర్ కొంకటి అశ్విని, విద్యార్థిని విద్యార్థులు గర్భిణీ స్త్రీలు బాలింత లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# యాసంగి సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి

సిద్దిపేట : యాసంగి సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుండి నిర్వహించిన జూమ్ సమావేశంలో కలెక్టర్ రబీ సీజన్ 2025-26 వరి కొనుగోలు ఏర్పాట్లపై ఆర్డీవోలు, సివిల్ సప్లై, మెప్మా, డిఆర్డీఏ, తహసీల్దార్లు, డిసిఓ, డిఏఓ, డీఎం మార్కెటింగ్ తదితర అధికారులకు సమగ్ర దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ఈ రబీ సీజన్‌లో అంచనాలకు మించి ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి మండలంలో తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఏపిఎం, మహిళ సమాఖ్య ఓపిఓలు, మార్కెటింగ్, అగ్రికల్చర్ అధికారులతో సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ముందస్తు సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని 421 కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగులు, తేమ కొలిచే యంత్రాలు, తాలు తీసే యంత్రాలు, టార్పాలిన్ షీట్లు, బ్లోయర్లు, తాగునీటి సదుపాయం, టెంట్లు, విద్యుత్ కనెక్షన్, వేయింగ్ మిషన్లు, కార్మికులు తదితర అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రతి కేంద్రాన్ని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభించాలని తెలిపారు.

# మైలేజ్ కన్నా... డ్యామేజ్ ఎక్కువ..!



హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీరు తీవ్ర దుమారం రేపుతోంది. తాజాగా అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి సైతం కౌశిక్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాడిన పదజాలం విన్నవారికి ఇప్పటికే ఓ క్లారిటీ వచ్చేసింది. త్వరలో కౌశిక్ రెడ్డి శాసనసభ సభ్యత్వంపై వేటు లేదా కఠిన చర్యలు తప్పవనే సంకేతాలు చెప్పకనే చెప్పేశారు సీఎం. అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డిపై అసెంబ్లీలో నిప్పులు చెరిగిన విధానం, ఏకంగా ఓ ఎమ్మెల్యే అసెంబ్లీ నక్సలైట్‌గా కౌశిక్ రెడ్డిని పోల్చిన తీరు పెను సంచలనంగా మారింది. ఓ ఎమ్మెల్యేపై అసెంబ్లీలో ఇంత రచ్చ అవసరమా అని కొందరు అనుకోవచ్చు, కానీ కౌశిక్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా 2021లో హుజూరాబాద్ ఉపఎన్నికల్లో గెలిచిన నాటి నుంచి ఆయన దూకుడు మాములుగా లేదంటున్నారు రాజకీయ విమర్శకులు. తాజాగా సీనియర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లడుతుండగా తుపాకీతో కాల్చిపడేస్తానంటూ అసెంబ్లీలో సైగలు చేసి, అవమానించారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎథిక్స్ కమిటీని సైతం ఏర్పాటు చేసి వేటుకు రంగం సిద్దం చేశారు. కౌశిక్ రెడ్డిని వివాదాలు వెంటాడతాయో లేక తానే వివాదాలను ముద్దాడుతాడో తెలియదు కానీ, ఎక్కడుంటే అక్కడ పొలిటిక్ రచ్చ సర్వసాధారణంగా మారింది. 2024లో హైదరాబాద్‌లో విధినిర్వహణలో ఉన్న ఓ ఎస్ఐపై అనుచితంగా ప్రవర్తించాడని, విధులకు ఆటంకం కలిగించాడని కౌశిక్ రెడ్డిపై అప్పట్లో కేసు నమోదైంది. హైదరాబాద్ కౌశిక్ నివాసం చుట్టూ భారీగా పోలీసులు మోహరించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ వివాదానికి ముందు తన భార్య శాలినీ పుట్టినరోజు సందర్భంగా యాదాద్రి గుడిలో ఫొటో షూట్ నిర్వహించి, సోషల్ మిడియాలో వీడియోలో పోస్ట్ చేయడంపై కౌశిక్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చెలరేగాయి. 2025లో కరీంనగర్ కలక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ మాట్లడుతుండగా, నువ్వు ఏ పార్టీ ఎమ్మెల్యేవి చెప్పంటూ కౌశిక్ రెడ్డి మధ్యలో జోక్యం చేసుకోవడం, సంజయ్‌తో బాహాబాహీకి దిగడం వివాదంగా మారింది. తనపైన కౌశిక్ రెడ్డి దాడి చేశాడంటూ ఎమ్మెల్యే సంజయ్ ఇచ్చిన ఫిర్యాదుతో సెక్షన్ 126,115, 352, 292ల కింద కేసు నమోదు చేసిన కరీంనగర్ పోలీసులు, హైదరాబాద్ వచ్చి కౌశిక్ రెడ్డిని బలవంతంగా అరెస్ట్ చేసి కరీంనగర్ స్టేషన్ కు తరలించారు. ఓ గ్రానేట్ సంస్ద యజమానిని బెదిరించి 50లక్షలు డబ్బు డిమాండ్ చేశారనే ఆరోపణలపై జూన్ 1, 2025లో శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి విదేశాలకు వెళ్లే ప్రయత్నం చేస్తుండగా కౌశిక్ రెడ్డిని అరెస్ట్ చేసి, ఎక్స్ టార్షన్ కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. అంతకు ముందు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు చీరా, గాజులు చూపిస్తూ కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఇటీవల సమక్క సారక్క జాతర జరుగుతున్న సమయంలో వీణవంక మండలంలోని సమ్మక్క జాతరకు కుటుంబ సమేతంగా వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన హంగామా అంతా ఇంతా కాదు, విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారిని మతం పేరుతో దూషించాడంటూ పెను దుమారం రేగింది. అదే రోజు బలవంతంగా కౌశిక్ రెడ్డిని అదుపులోకి తీసుకోవడం, రోజంతా హైడ్రామా కొనసాగింది. ఆవేశంలో మాట్లడాను , కావాలని మతం పేరుతో పోలీసు అధికారిని దూషించలేదంటూ క్షమాపణలు కోరుతూ మరుసటి రోజు వీడియో విడుదల చేయడంతో వివాదం కాస్తా తాక్కాలికంగా సర్దుమణిగింది. ఇలా ఒకటేమిటి హుజూరాబాద్ గడచిన ఎన్నికల సమయంలో కౌశిక్ రెడ్డి ఓట్లు అభ్యర్దించిన తీరు, కుటుంబ సమేతంగా విడుదల చేసిన వీడియోలు రాజకీయంగా వివాదాలను తెచ్చిపెట్టాయి. బీఆర్ ఎస్ నుంచి కాంగ్రెస్‌కు పార్టీ మారిన ఎమ్మెల్యేలు అరెకెపూడి గాంధీ, దానం నాగేందర్‌పై కౌశిక్ చేసిన వ్యాఖ్యలపై అంతే స్థాయిలో వాళ్లు స్పందించిన విధానం తిరిగి కౌశిక్ మెడకు చుట్టుకున్నాయి. కండలు తిరిగిన శరీరాకృతితో కనిపించే కౌశిక్ రెడ్డి, హావభావాలు, మాట్లాడే విధానం, ఎదుటి వ్యక్తులతో దురుసుగా ప్రవర్తించిన తీరుతో అధికార కాంగ్రెస్ పార్టీ విసిగిపోయింది. అదును చూసి దెబ్బకొట్టింది. అసెంబ్లీ నుంచి సాగనంపేందుకు సిద్దమైంది. అయితే బీఆర్ఎస్ మాత్రం తమ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి దూకుడుతో పార్టీకి డ్యామేజ్ జరుగుతుందో, మైలేజ్ వస్తుందో, అర్దం కాని అయోమయంలో కనిపిస్తోంది. సమర్థిస్తే పరువు పోతుంది. వెనుకేసుకొస్తే జనం నవ్వుతారేమో అనే దీర్ఘాలోచనలో ఉన్నట్లు కనిపిస్తోంది. కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరి, ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత జరిగిన వరుస ఘటనల వల్ల పార్టీకి లాభం కంటే, నష్టమే ఎక్కువ. దూకుడు తప్పుకాదు, ఆవేశం తప్పుకాదు, కానీ ఎక్కడ వాడాలో తెలియకపోవడం అతిపెద్ద ముప్పు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విషయంలో అదే జరుగుతోందంటున్నారు రాజకీయ విశ్లేకులు. విమర్శించడం, దాడి చేయడం, అరెస్ట్ అవ్వడం, నోరు జారడం, క్షమాపణలు చెప్పడం.. ఇలా కౌశిక్ రెడ్డికి గత కొంతకాలంగా అలవాటైపోయింది. ఈసారి అసెంబ్లీలో కడియంపై సైగలు చేసి అడ్డంగా దొరికేశాడంటున్న అధికార పార్టీ, భవిష్యత్‌లో మరెవరూ ఇలా మాట్లాడకుండా చేస్తామంటూ చెప్పిమరీ వేటు వేసేందుకు సిద్దమైంది.

# ఉక్కపోతలో ఈటెల

హైదరాబాద్ : భారతీయ జనతా పార్టీలో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ఉక్కపోతకు గురవుతున్నారా? పార్టీ మారుతానని సోషల్ మిడియాలో సొంత పార్టీ నేతలే దుష్ప్రచారం చేస్తున్నారని, వివిధ రకాలుగా ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఆయన భావిస్తున్నారా? అంటే తాజాగా చేసిన వ్యాఖ్యలు అవుననే అంటున్నాయి. దుష్ప్రచారంపై సొంత పార్టీ నాయకులపై పరోక్షంగా అప్పుడప్పుడు ఆక్రోశం సైతం వెళ్లగకుతున్నారు. ఈటెల రాజేందర్ మళ్లీ బి ఆర్ ఎస్ లో చేరుతున్నారని ఇటీవల సోషల్ మిడియాలో బాగా ప్రచారం జరుగుతోంది. ఇలా ప్రచారం జరగడం కొత్త కాదు. గతంలోనూ ఇలాంటి ప్రచారం జరగగా రాజేందర్ ఖండించారు. తాజాగా మళ్లీ ఆదివారం పూడూరు శివారులో ని నివాసంలో దుష్ప్రచారాన్ని ఖండించారు. కెసిఆర్ తనను భర్తరఫ్ చేశారని, ఆర్థికంగా అనేక ఇబ్బందులు పెట్టారని, అప్పటి ఇబ్బందులు తలుచుకుంటేనే బాధ అనిపిస్తుందని, ఎన్నో సమస్యలు ఎదుర్కొని మళ్లీ బి ఆర్ ఎస్ లో ఎలా చేరుతానని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. ఈ ప్రచారం వెనుక సొంత పార్టీ నాయకుల హస్తముందని ఆయన భావిస్తున్నారు. గతంలో ప్రచారం జరిగినప్పుడు కూడా సొంత పార్టీ నాయకులపై నిప్పులు చెరిగారు. జూలై 19న హుజురాబాద్ నుంచి పార్టీ కార్యకర్తలు పూడూరులోని ఆయన ఇంటికి వచ్చిన సమయంలో ఘాటు వ్యాఖ్యలు చేశారు.' ఒక సైకో, శాడిస్టు, వాడు మనిషా, ఏ పార్టీలో ఉన్నాడు, కొడుకా బి కేర్ఫుల్'అని మండిపడ్డారు. ఎవరు సోషల్ మిడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఈటెల రాజేందర్ సొంత నియోజకవర్గంలో హుజురాబాద్ వెళ్ళవద్దని బిజెపి నాయకులు ఆంక్షలు విధించారు. 20 ఏళ్లు ఆ నియోజకవర్గంలో ప్రాతినిధ్యం వహించారు. ఆయనకు పెద్ద సంఖ్యలో అనుచర గణం ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈటెల రాజేందర్ అక్కడే పోటీ చేశారు. ఆ నియోజకవర్గంలో ప్రభావితం చేయగల నాయకుడు. అయినప్పటికీ హుజురాబాద్ వెళ్ళవద్దని పార్టీ పెద్దలు సూచించడం విస్మయానికి గురిచేస్తుంది. ఎన్నికల సమయంలో నాయకులందరినీ ప్రచారానికి పిలిచి పార్టీ అభ్యర్థుల విజయానికి చర్యలు



తీసుకుంటారు. ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోరు. కానీ ఈటెల రాజేందర్ ను హుజురాబాద్ రావద్దు అని చెప్పడం అంతర్గత పోరుకు అద్దం పడుతోంది. అంతర్గత వర్గ పోరులో బీజేపీ అభ్యర్థులు బలయ్యారు. ఈటల రాజేందర్ కు ఢిల్లీ పెద్దలతో సత్సంబంధాలు ఉన్నాయి. వివిధ సందర్భాలలో కేంద్ర మంత్రులను, అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోడీ లను కలుస్తుంటారు. కానీ రాష్ట్ర నాయకులతో విభేదాలు ఉన్నాయి. పదవులు రాకుండా రాష్ట్ర నాయకులు అడ్డుకుంటున్నారని రాజేందర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. సొంత పార్లమెంటు నియోజకవర్గం మల్కాజిగిరి లోను తన ప్రభావాన్ని తగ్గించడానికి ప్రయత్నిస్తున్నట్లు ఈటెల రాజేందర్ అనుమానిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమయంలో ఇతర నాయకులు వేలు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని భావించి గెలిచేవారికి టికెట్లు అని ప్రకటించారు. అంతేగాక ఈ నియోజకవర్గంలో తనకున్నంత అవగాహన ఇంకొకరికి ఉండదని స్పష్టం చేశారు.

# ధాన్యంతో అన్నదాతల నిరీక్షణ



నిజామాబాద్ : మార్చి మూడో వారం నుంచే వరి కోతలు ప్రారంభమై ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి. రైతులు పెద్ద ఎత్తున ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తరలిస్తున్నప్పటికీ కొనుగోళ్లు జరగకపోవడంతో నిల్వ సమస్యలు తీవ్రంగా మారాయి. పదిహేను రోజులుగా రైతులు ధాన్యాన్ని కుప్పలుగా వేసి కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నా, ఇప్పటివరకు ఒక్క క్వింటాల్ కూడా అధికారికంగా కొనుగోలు కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఏర్పాటు చేయాల్సిన 22 ఐకేపీ, 5 పిఏసిఎస్, 3 మెప్మా కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాలేదు. గతంలో కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రదేశాల్లోనే రైతులు ధాన్యం రాశులు పోసి వేచి చూస్తున్నారు. ధాన్యం పండించి కోత కోసిన అన్నదాతలకు నిరీక్షణ తప్పడం లేదు. మండలంలోని పలు గ్రామాలలో గత పది, పదిహేను రోజుల నుండి వరి కోతలు మొదలయ్యాయి. వరి కోతలు మొదలై చేతికొచ్చిన పంటను కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించి ఆరబోసుకున్నారు. ఇంకా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం అన్నదాతలను ఒకింత ఆందోళనకు గురి చేస్తుంది. మండలంలో దాదాపు 25 శాతం వరి పొలాలు కోతలు పూర్తయ్యాయి. అయినా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో కొంతమంది రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోవాల్సిన పరిస్థితి వస్తోంది. ఇప్పటి వరకు మంగపేట మండలంలో ఎక్కడా కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఊసే లేదు. దీనికి తోడు గత నాలుగు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులకు అన్నదాతలు మరింత ఆందోళనకు గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం, వర్షాలు పడే అవకాశాలు కనబడుతుండడంతో కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రైతాంగం కోరుతుంది పలు గ్రామాలలో గత పది, పదిహేను రోజుల నుండి వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగు రోజుల నుండి ఆకాశం మబ్బుగా ఉంది. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియని పరిస్థితి. వర్షం వస్తే కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం తడిచిపోయే అవకాశం ఉంది. దీంతో రైతులకు నష్టం వాటిల్లుతుంది. మండలంలో ఒకటి, రెండు చోట్ల లాంఛనంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పత్రికలకు ప్రకటనలు ఇవ్వడమే తప్ప మండలంలో ఇప్పటి వరకు ఎక్కడా ఒక్క బస్తా వడ్లను కూడా కొనలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి.

**కలవరపడుతున్న రైతులు..** ఎండల కారణంగా తేమ శాతం అనుకూలంగా ఉన్నప్పటికీ, అకాల వర్షాల భయం రైతులను కలవరపెడుతోంది. ఇతర ప్రాంతాల్లో వారం రోజుల క్రితమే ధాన్యం కేంద్రాలకు రాక ప్రారంభమైనప్పటికీ, కొనుగోళ్లు ఎక్కడా ప్రారంభం కాలేదని రైతులు చెబుతున్నారు. ధాన్యం కుప్పలుగా పేరుకుపోవడంతో వాటి రక్షణ కూడా సమస్యగా మారింది. ప్రస్తుత పరిస్థితుల ప్రకారం పూర్తిస్థాయిలో కొనుగోళ్లు ప్రారంభం కావడానికి ఇంకా సమయం పట్టే అవకాశముందని తెలుస్తోంది. ఇదే సమయంలో అకాల వర్షాలు, వడగండ్ల వానల ముప్పు ఉండటంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి తమను మండల రైతులు కోరుతున్నారు. వడ్లను గతంలో ధాన్యం కొనుగోలు చేసిన చోటుకు తీసుకువచ్చి 10 రోజులు అవుతోంది. కొనుగోలు కేంద్రం ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియట్లేదు. ఇప్పటి వరకు ఇక్కడ ఈ విధమైన ఏర్పాట్లు చేయలేదు ఈడ పరిస్థితి చూస్తుంటే ఇంకా సమయం పట్టేటట్టు ఉంది.

# అక్రమ ఇసుక రవాణాపై కరీంనగర్ పోలీసులు ఉక్కుపాదం

## - కరీంనగర్ సీపీ గౌష్ ఆలం

కరీంనగర్ : కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా, నిల్వ మరియు విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని పోలీస్ అధికారులు తెలిపారు. మార్చి నెలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 120 కేసులు నమోదు చేసి,139 వాహనాలను స్వాధీనం చేసుకుని,161 మంది నిందితులపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అక్రమ ఇసుక రవాణా కారణంగా ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడమే కాకుండా, రోడ్డు భద్రత, పర్యావరణ సమతుల్యత, ప్రజా శాంతి భద్రతలపై ప్రతికూల ప్రభావం పడుతున్న నేపథ్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. డివిజన్ వారీగా చర్యలుటౌన్ డివిజన్ పరిధిలో 15 కేసులు,12 వాహనాల స్వాధీనం,15 మంది నిందితులపై చర్య లు తీసుకున్నారు. రూరల్ డివిజన్ పరిధిలో అత్యధికంగా 73 కేసులు,79 వాహనాల స్వాధీనం,98 మంది నిందితులపై కేసులు నమోదయ్యాయి. హుజురాబాద్ డివిజన్ పరిధిలో 32 కేసులు,48 వాహనాల స్వాధీనం,48 మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు.

పోలీస్ స్టేషన్‌ల వారీగా ముఖ్య గణాంకాలు:మార్చి నెలలోకరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా 28 ఎఫ్ఐఆర్‌లు,36 వాహనాల స్వాధీనం,40 మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు. జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలో 15 కేసులు,24 వాహ నాల స్వాధీనం,24 మంది నిందితులు నమోదు అయ్యారు. ఎల్ఎండీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో 15 కేసులు నమోదయ్యాయి. మానకొండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 10 కేసులు,10 వాహనాలు,15 మంది నిందితులు గుర్తించబడ్డారు. కరీంనగర్-2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 9 కేసులు,6 వాహనాలు,9 మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు. ఈ ఏడాది మార్చి వరకు సమగ్ర గణాంకాలు:2026 సంవత్సరంలో మార్చి నెల వరకు కమిషనరేట్ పరిధిలో మొత్తం 245 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా, 357 వాహనాలను స్వాధీనం చేసుకుని, 422 మంది నిందితులపై కేసులు నమోదు చేసినట్లు సీపీ తెలిపారు. డివిజన్ వారీగా:టౌన్ డివిజన్: 24 కేసులు,27 వాహనాలు, 32 నిందితులురూరల్ డివిజన్: 139 కేసులు, 203 వాహనాలు, 241 నిందితులు, హుజురాబాద్ డివిజన్: 82 కేసులు, 127 వాహనాలు, 149 నిందితులు, పోలీసుల హెచ్చరికఅక్రమంగా ఇసుక తవ్వకం, రవాణా, నిల్వ, విక్రయాల్లో పాల్గొనే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించాలని, సమాచారదాతల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. సీపీ సందేశంఅక్రమ ఇసుక రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడమే కాకుండా పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం జరుగుతుంది. ఇలాంటి కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించము. సంబంధిత పోలీస్ స్టేషన్‌ల పరిధిలో తనిఖీలు, నిఘా మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం అని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేసి ఆరోగ్య ఆదిలాబాదుగా తీర్చిదిద్దాలి

ఆదిలాబాద్ : ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేసి ఆరోగ్య ఆదిలాబాదుగా తీర్చిదిద్దాలనీ జిల్లా కలెక్టర్ రాజర్షిషా వైద్య శాఖ అధికారులకు సూచించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం స్థానిక రిమ్స్ ఆసుపత్రి ఆడిటోరియంలో నిర్వహించిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకల కార్యక్రమానికి ఆదిలాబాదు పార్లమెంటు సభ్యులు గోడం నగేష్, ఆదిలాబాదు నియోజకవర్గ శాసన సభ్యులు పాయల శంకర్ తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేసి ఆరోగ్య ఆదిలాబాదుగా తీర్చిదిద్దాలని, నిన్నటి నుండి ప్రారంభమైన ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా సేఫ్ మదర్ హుడ్, ఎయిడ్స్ నివారణ, ఆయుష్ వంటి అంశాలపై వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. రిమ్స్ ఆసుపత్రి జిల్లాకే కాకుండా పొరుగు రాష్ట్రాల ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని కొనియాడారు. ముఖ్యంగా సర్జికల్ ఆంకాలజీ విభాగంలో జరుగుతున్న శస్త్రచికిత్సలు, శిశు మరణాల రేటును తగ్గించేందుకు చేపట్టిన 'సంకల్ప' ప్రోగ్రామ్ ద్వారా రిమ్స్ కు జాతీయ స్థాయి గుర్తింపు, టీబీ నివారణలో జిల్లా యంత్రాంగం సాధించిన పురోగతికి గాను అవార్డులు రావడం అభినందనీయమన్నారు. పాఠశాల స్థాయి నుండే పిల్లలు గుట్కా, పాన్ మసాలా, మద్యం, గంజాయి వంటి అలవాట్లకు లోనవుతుండటం ఆందోళనకరమని, ఇటువంటి వారిని గుర్తించి రిమ్స్ లేదా స్వచ్ఛంద సంస్థలు నడిపే డి-అడిక్షన్ సెంటర్లలో చేర్పించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. అలాగే గర్భిణీ స్త్రీలలో రక్తహీనత (అనిమియా) సమస్య తీవ్రంగా ఉందని, అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను సక్రమంగా వాడేలా చూడాలన్నారు. ఆర్.ఎం.పిల వద్దకు వెళ్లి అనవసరమైన యాంటీబయాటిక్స్, ఇంజక్షన్లు తీసుకోవడం వల్ల కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందని, ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. వేసవి కాలం దృష్ట్యా ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, తగినంత నీరు తాగడం, 6 నుండి 7 గంటల నిద్ర, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ యోగా, వ్యాయామం వంటివి అలవర్చుకోవాలని సూచించారు. ఆదిలాబాదు పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ, మానవ జీవితం చాలా స్వల్పమైనదని, డబ్ల్యూహెచ్ఓ నివేదికల ప్రకారం సగటు జీవితకాలం 60 నుండి 70 ఏళ్లకు తగ్గిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా ఏప్రిల్ 7వ తేదీన ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒక ప్రత్యేక థీమ్‌తో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఇది కేవలం సంబరాల కోసం కాకుండా మన ఆరోగ్యంపై మనకు అవగాహన కలిగించే 'అలారం' వంటిదని పేర్కొన్నారు. నేటి సమాజంలో 30-40 ఏళ్లకే అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని, ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరిగితే ప్రభుత్వం వైద్యం కోసం చేసే భారీ ఖర్చు తగ్గుతుందని అభిప్రాయ పడ్డారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో పనిచేసే ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాత్ర కీలకమని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వైద్యులను ఎంతగానో నమ్ముతారని, వారికి సరైన అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాలలోని ఆర్ఎంపీలు ప్రథమ చికిత్సకు పరిమితం కాకుండా హై డోస్ మందులు, పెయిన్ కిల్లర్లు ఇవ్వడం వల్ల ప్రాణాపాయం సంభవిస్తోందని హెచ్చరించారు. గతంలో బజార్ హత్నూర్, గాదిగూడ వంటి మండలాల్లో కిడ్నీ సమస్యలతో పలువురు మృతి చెందడానికి విదేశాల నుండి వచ్చిన అనర్హులైన వ్యక్తులు చేసే వైద్యమే కారణమని గుర్తు చేశారు. యువత గంజాయి, గుట్కా, సిగరెట్లు వంటి వ్యసనాలకు బానిసలవుతున్నారని, దీనిపై కఠిన నియంత్రణ అవసరమని పేర్కొన్నారు. శారీరక, మానసిక దృఢత్వం కోసం ప్రతి ఒక్కరూ నడక, యోగా ధ్యానం వంటి అలవాట్లను జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం, ప్రజలు భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తూ అందరికీ ప్రపంచ ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో మనిషి ఏ రంగంలో ఉన్నా విపరీతమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒత్తిడి నుండి బయటపడాలన్నా, ఆరోగ్యంగా ఉండాలన్నా మనం తీసుకునే ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, నడక వంటి అంశాలను సమన్వయం చేసుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు. భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరం యోగా అని, 2014-15లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యోగా ప్రాముఖ్యతను ప్రపంచ వేదికలపై చాటిచెప్పినప్పుడు మొదట్లో కొందరు విమర్శించారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అయితే, ఐక్యరాజ్యసమితిలో యోగాను గుర్తించిన తర్వాత, శాస్త్రీయంగా దీనివల్ల మందుల వాడకం దాదాపు 44 శాతం తగ్గిందని అనేక పరిశోధనలు నిరూపిస్తున్నాయని వివరించారు. యోగాను అలవరచుకోవడం ద్వారా సుమారు 50 నుండి 60 శాతం వరకు రోగాల బారిన పడకుండా ఉండవచ్చని, ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, తప్పనిసరిగా సమయానికి ఆహారం, నిద్ర తీసుకోవాలని సూచించారు. బయట ఫుడ్ తీసుకోకుండా ఆరోగ్య పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా టిబి నియంత్రణపై ప్రతిజ్ఞ చేసి, ఆయుష్ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. తదుపరి ఉత్తమ వైద్య సేవలు అందించిన పలువురు వైద్యులకు, సిబ్బందికి, నిక్షయ మిత్రాలకు కలెక్టర్, ఎంపీ ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం నూతన టిబి ఎక్స్ రే యంత్రాన్ని కలెక్టర్, ఎంపీ ఆవిష్కరించి, టిబి వ్యాధిగ్రస్థులకు నిక్షయా పోషన్ కిట్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, లీగల్ అడ్వైజర్ దాసరి గంగారం, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీపురం గార్డెన్స్‌లో ఇంటి దొంగతనం

## - బాధితుడి ఇంటిని పరిశీలించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

దెందులూరు/పెదవేగి : పెదవేగి మండలం లక్ష్మీపురం గార్డెన్స్‌లో జరిగిన భారీ చోరీ ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానిక రైతు మన్నె సుబ్రమణ్యం గారి ఇంట్లో యజమానులు లేని సమయం చూసి దొంగలు పడి భారీగా బంగారం మరియు నగదును అపహరించారు. ఈ విషయం తెలుసుకున్న దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ పోలీసు అధికారులతో కలిసి బాధితుడి ఇంటిని స్వయంగా పరిశీలించారు. రైతు మన్నె సుబ్రమణ్యం గత నాలుగు రోజులుగా ఊర్లో లేకపోవడంతో, ఇంటికి తాళం వేసి ఉంది. ఈరోజు ఉదయం వారి సమీప బంధువులు వచ్చి చూడగా, ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటం గమనించి విస్తుపోయారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని భారీ మొత్తం బంగారం, నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే సమాచారాన్ని ఎమ్మెల్యే గారికి మరియు పోలీసులకు అందించారు. పోలీసులకు ఎమ్మెల్యే ఆదేశాలు: సంఘటనా స్థలానికి చేరుకున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గారు, దొంగతనం జరిగిన తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం అక్కడి పోలీసు అధికారులతో మాట్లాడుతూ.. ఈ కేసును సవాల్‌గా తీసుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులను తక్షణమే పట్టుకోవాలని ఆదేశించారు. రైతు కష్టార్జితమైన బంగారం, నగదు త్వరగా రికవరీ అయ్యేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రజలకు సూచన:ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ.. గ్రామాల్లో నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా నివాస ప్రాంతాల్లో, కాలనీల్లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారా దొంగతనాలకు అడ్డుకట్ట వేయవచ్చని, ఏదైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ మేక కనకరాజు , పెదవేగి సర్కిల్ ఇన్స్పెక్టర్ చిన్నం రాజశేఖర్ సహా స్థానిక కూటమి నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మెట్రో సిటీటైమ్స్ METRO CITY TIMES శుక్రవారం, ఏప్రిల్ 10, 2026

# చెత్త సేకరణ ట్రాక్టర్కు నిప్పు

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠం మండలంలోని సోమిరెడ్డి పల్లె గ్రామపంచాయతీ గ్రామ సచివాలయం వన్ పరిధిలోని చెత్త సేకరణ టాక్టర్కు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. పంచాయతీ కార్యదర్శి మరియు పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వలన పంచాయతీ ప్రజలకు సంబంధించిన ఆస్తి కాపాడడంలో అధికారులు విఫల మైనట్లు ఆరోపణలు వెలివేలుస్తున్నాయి.గ్రామ, పట్టణాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడానికి చెత్త సేకరణ ట్రాక్టర్ /ట్రాలీలు అత్యంత కీలకం. ఇవి తడి, పొడి చెత్తను ఇళ్ల నుండి సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తాయి. పంచాయతీలు, మున్సిపాలిటీలు స్వచ్ఛ భారత్ మిషన్ కింద వీటిని ఉపయోగిస్తున్నాయి. ప్రతిరోజు ఉదయం చెత్త సేకరణ చేసి ఏ రోజు చెత్త ఆరోజు డంపింగ్ యార్డ్ కు చేర్చాల్సి ఉంది అయితే చెత్త ట్రాక్టర్ ట్రాలీలు ఉంచడం పట్ల చెత్త నింపి ఉన్న టాక్టర్ ట్రాలీలు కు ఎవరో నిప్పంటించారు గతంలో కూడా ఒకసారి ట్రాక్టర్ నిప్పు అంటించడంతో ట్రాక్టర్ కు ఉన్న టైర్లు పూర్తిగా కాలిపోయాయి దీనివల్ల పంచాయతీ సొమ్ము దుర్వినియోగం అయింది అదేవిధంగా పంచాయతీలో ఉన్న రిక్షాలు ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తున్నాయి కానీ గ్రామాలలో ఎవరు చెత్త సేకరణ చేయడం లేదు రిక్షాలు నిరుపయోగంగా ఉన్నాయి పంచాయతీ సోషల్ ఆఫీసర్లు ఇప్పటికైనా పంచాయతీ సొమ్ము పై బాధ్యతగా వ్యవహరించాలని పలువురు ప్రజలు సైతం కోరుకుంటున్నారు

## ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన డిఎస్పీ నాగేంద్ర చారి

రాజన్న సిరిసిల్ల : సిరిసిల్ల పట్టణ పరిధిలోని పాత బస్టాండ్ వద్ద మార్కండేయ ఫార్మసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డిఎస్పీ నాగేంద్రచారి ప్రారంభించారు వేసవి కాలంలో ప్రయాణికులు, స్థానిక ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అని డిఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని, మరిన్ని సంస్థలు ముందుకు వచ్చి ప్రజలకు సహాయం చేయాలని సూచించారు వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఫార్మసీ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నరసరావుపేట ఫ్లైఓవర్ పై ప్రమాదం

## - బైక్ వాహనదారుడు దుర్మరణం

నరసరావుపేట : నరసరావుపేటలోని నాగూర్ వలి ఫ్లైఓవర్ పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ట్రాఫిక్ సీఐకి వచ్చిన సమాచారం మేరకు.. బైక్‌పై వెళ్తున్న యువకుడు అతివేగంతో వెళ్లి ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్ పైనుంచి ఎగిరి ఎదురుగా వస్తున్న ఆటో కింద పడిపోవడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ సిబ్బంది వెంటనే స్పందించి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే మృతి చెందాడు. యువకుడి బైక్ అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సాగర్ కుడి కాలువ లోకి దూకి తల్లి, కూతురు మృతి

మాచర్ల : మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామ సమీపంలోని కుడి కాలువలోకి గుర్తు తెలియని మహిళ పాపను నడుముకు కట్టుకొని ఉదయం సుమారు 11 గంటల ప్రాంతంలో కాలువలోకి దూకిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో స్థానికులు పలువురు వారిని కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే వారు మృతి చెందారు. విజయపురిసౌత్ ఎస్సై అశోక్, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. స్థానికులు అలాగే ఎవరికైనా వీరి వివరాలు తెలిస్తే విజయపురిసౌత్ పోలీసులకు సమాచారం అందించగలరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9440900884.

## వైసీపీ మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి ఆధ్వర్యంలో నరసరావుపేటలో నిరసన ర్యాలీ, మానవహారం

నరసరావుపేట : పల్నాడు జిల్లా,నరసరావుపేట లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యం లో నిరసన ర్యాలీ, మానవహారం కార్యక్రమం బుధవారం జరిగింది. ఏబీఎన్ రాధాకృష్ణ వాఖ్యలపై నిరసనగా వైసీపీ ఆఫీస్ నుండి మల్లమ్మ సెంటర్, గడియార స్తంభం, పాత పల్నాడు బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ సాగింది. పల్నాడు రోడ్ లోని పాత ఆంధ్రజ్యోతి ఆఫీస్ ముందు వైసీపీ శ్రేణులు మానవహారం నిర్వహించారు. మహిళల పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బూతు తిట్టు వెనక్కి తీసుకొని, క్షమాపణ చెప్పాలని గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ పై నాన్ బెయిలబుల్ కేసుకట్టాలని వైసీపీ శ్రేణులు డిమాండ్ చేశారు. ఏబీఎన్ రాధాకృష్ణ చరిత్ర రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలియంది కాదని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు.

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

### - జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

### గోదావరి పుష్కరాల పిపిటి సమావేశంలో టెక్నికల్ కమిటీ పరిశీలన

జగిత్యాల: జిల్లాలో నిర్వహించనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై పురోగతిని సమీక్షించేందుకు జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన పిపిటి సమావేశంలో టెక్నికల్ కమిటీ సమగ్ర పరిశీలన నిర్వహించింది. ఈ పరిశీలనకు ఇంజినీర్- ఇన్-చీఫ్ జనరల్ ఓ.వి. రమేష్ బాబు, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన మౌలిక వసతుల అభివృద్ధి, భద్రతా చర్యలు, రవాణా సౌకర్యాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య ఏర్పాట్లు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే, ఘాట్‌ల అభివృద్ధి పనులు, రహదారి మరమ్మత్తులు, విద్యుత్ సరఫరా, తాత్కాలిక సౌకర్యాల ఏర్పాటు వంటి అంశాలను వేగవంతం చేయాలని టెక్నికల్ కమిటీ సూచించింది. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ఈ.ఈ.పి.ఆర్. లక్ష్మణ్ రావు, ఈ.ఈ. ఆర్ అండ్ బి శ్రీనివాస్, ధర్మపురి టెంపుల్ ఈవో శ్రీనివాస్, నీటి పారుదల శాఖ అధికారుల, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హోళగుంద మండల సర్పంచులకు ఘనంగా సన్మానం

హోళగుంద : ఇటీవల సర్పంచుల పదవీకాలం ముగిసిన హోళగుంద మండల సర్పంచులను ఎంపీడీఓ విజయలలిత,డిప్యూటీ ఎంపీడీఓ చక్రవర్తి ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో హోళగుంద మండల సర్పంచులకు శాలువ కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానం చేశారు. అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా సర్పంచ్‌లు గ్రామాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తూ,గ్రామాల్లో ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుని వాటి పరిష్కారానికి ముందుండి పని చేశారని కొనియాడారు. ఇంకా భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ప్రజాసేవలో ముందుండాలని తెలిపారు. ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు ఆయా గ్రామాల సర్పంచులు ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# రాష్ట్రానికి మార్గదర్శకంగా అన్నమయ్య జిల్లా

రాయచోటి : జిల్లాలో నీటి భద్రత సాధనలో "జలధార" కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా అమలు చేసిన అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కృషిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రశంసించారు. మంగళవారం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్) లో గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థల్లో ఉపరితల మరియు భూగర్భ జల వనరుల స్థిరత్వం (సోర్స్ సస్టైనబిలిటీ) అంశంపై నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాప్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సదస్సుకు అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ను ఉప ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగింది. జిల్లాలో అమలు చేసిన జలధార ప్రాజెక్టుపై సదస్సులో కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి అందరికీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రివర్యులు మాట్లాడుతూ. అన్నమయ్య జిల్లాలో అమలు చేసిన జలధార ప్రాజెక్టు రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. జలధార ద్వారా కరువు ప్రభావిత ప్రాంతమైన అన్నమయ్య జిల్లాలో నీటి వనరుల అభివృద్ధి సాధ్యమైందని, నీటి సంరక్షణలో విప్లవాత్మక మార్పు వచ్చిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రధానంగా కేవలం 5 నెలల్లోనే భూగర్భ జలాలు 8.59 మీటర్లు పెరగడం, 962 మైనర్ ఇరిగేషన్ చెరువుల పునరుద్ధరణ, సుమారు 20,000 ఎకరాల భూభాగానికి నీటి రీచార్జ్, గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం... ఇవి జలధార విజయానికి నిదర్శనాలని పేర్కొన్నారు. కలెక్టర్‌కు ప్రత్యేక అభినందనలుఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ?జలధార ప్రాజెక్టును అంకితభావంతో అమలు చేసి, కరువు జిల్లాను నీటి భద్రత దిశగా తీసుకెళ్లిన కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ విజయాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయడానికి మార్గదర్శకంగా తీసుకోవాలని సూచించారు. అలాగే కార్యక్రమంలో పాల్గొన్న నిపుణులు, శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు జలధార ప్రాజెక్టును బాగా స్టడీ చేసి రాష్ట్రవ్యాప్తంగా నీటి సంరక్షణ చర్యలు ప్రభావంతంగా అమలయ్యే విధంగా కృషి చేయాలని సూచించారు. జలధార అమలు ? సమగ్ర ప్రణాళికసదస్సులో కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో బేసిన్ ఆధారిత నీటి సంరక్షణ విధానాన్ని అనుసరించి, నదీ పరివాహక ప్రాంతాలను గుర్తించి, మిగులు నీటిని లోటు ప్రాంతాలకు మళ్లించే చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రధానంగా పెన్నా నది పరివాహక ప్రాంతం, చెయ్యేరు, పాపాఘ్ని ఉపనదుల వినియోగం, 49 ఉప పరివాహక ప్రాంతాల గుర్తింపు532 కాస్కేడ్స్ ద్వారా 382 చెరువుల అనుసంధానం, 962 ఎండిపోయిన చెరువుల పునరుద్ధరణ, ఉపాధి హామీ పథకం ద్వారా విస్తృత పనులు తదితర చర్యల వల్ల వృథాగా పోయే నీటిని సమర్థంగా వినియోగించగలిగామని వివరించారు. వేల కోట్ల వ్యయం అవసరమయ్యే భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు బదులుగా, అందుబాటులో ఉన్న వనరులతోనే 3-4 టీఎంసీల నీటిని వినియోగంలోకి తీసుకురాగలిగామని కలెక్టర్ తెలిపారు. ఈ అవగాహన సదస్సులో జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

# పీఎం సూర్యఘర్ ఉత్సవ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కె.ఈ శ్యాం బాబు

### - ఎస్సీ,ఎస్టీ కుటుంబాలకు సౌర విద్యుత్ సదుపాయం

### - 23.06 కోట్ల నిధులతో 2056 మంది లబ్ధిదారులకు సౌర విద్యుత్ సదుపాయం

తుగ్గలి: ప్రధానమంత్రి సూర్యఘర్ ఉత్సవ్ ను కార్యక్రమాన్ని పత్తికొండ శాసనసభ్యులు కె.ఈ శ్యాం బాబు మంగళవారం రోజున ప్రారంభించారు. తుగ్గలి మండల పరిధిలోని గల జొన్నగిరి గ్రామం నందు 23.06 కోట్ల అంచనా వ్యయంతో 2056 మంది ఎస్సీ,ఎస్టీ లబ్ధిదారులకు లబ్ధి చేకూరే విధంగా సౌర విద్యుత్ సదుపాయాన్ని అందించనున్న కేంద్ర ప్రభుత్వ పథక శిలాఫలకాన్ని పత్తికొండ శాసనసభ్యులు కేఈ శ్యాంబాబు ప్రారంభించారు. అనంతరం ఈ పథకం ద్వారా మంజూరైన సోలార్ ప్యానల్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే శ్యాం బాబు మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ ఉత్సవ్ పథకాన్ని ప్రజలలోకి చేరవేసేలా కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ మరియు ఎస్టీ కుటుంబాలకు సబ్సిడీతో ఈ పథకాన్ని అమలు చేస్తుందని ఆయన తెలియజేశారు. ఆసక్తిగల ఎస్సీ,ఎస్టీ ప్రజలు సంబంధిత విద్యుత్ అధికారులను సంప్రదిస్తే ఈ పథకాన్ని వారికి మంజూరు చేస్తారని ఎమ్మెల్యే తెలియజేశారు. పీఎం సూర్యఘర్ పథకం వలన చాలావరకు కరెంటు చార్జీలు తగ్గుతాయని ఆయన తెలియజేశారు. ప్రజలకు ఈ పథకం పై అవగాహన కల్పించడం ద్వారా చాలామంది ఈ పథకం వైపు మొగ్గు చూపుతున్నారని విద్యుత్ అధికారులు తెలియజేశారు. కావున కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ విజయరాజు, పత్తికొండ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ మదన్మోహన్, తుగ్గలి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ సుజాత,పత్తికొండ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేశ్వర్ రెడ్డి, మద్దికేర ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ట్రాఫిక్ అహ్మద్,జొన్నగిరి వీఆర్వో కాశీ రంగస్వామి,పంచాయతీ కార్యదర్శి నారాయణ స్వామి,రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు వెంకటపతి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకట రాముడు,మాజీ సర్పంచ్ ఓబులేసు,ఉప్పర్లపల్లె సొసైటీ డైరెక్టర్ అప్పా వేణు, మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు,మధుబాబు, బీసీ మండల అధ్యక్షుడు కృష్ణ,విద్యా కమిటీ చైర్మన్ మిద్దె రవి,మిద్దె వెంకటేశ్వర్లు, తిమ్మయ్య చౌదరి,ఎర్రగుడి వెంకట స్వామి, చంద్రశేఖర్ యాదవ్, హోటల్ మల్లి,నీలా మనోహర్,గిరిగేట్ల సత్య ప్రకాష్,లక్ష్మణస్వామి,జయరాముడు తదితర మండల తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పత్తికొండ రూరల్ సీఐ పులి శేఖర్ గౌడ్, జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున తమ పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఉచిత ఇళ్ల స్థలాల పంపిణీ వేగవంతం కావాలి




అమరావతి : ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న పథకాలు.. కార్యక్రమాలను పక్కా ప్రణాళికలతో అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు.. సంతృప్తి కలిగించే రీతిలో సేవలు అందించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే విషయంలో ఎలాంటి జాప్యమూ జరగకూడదని ముఖ్యమంత్రి ఆదేశించారు. మంగళవారం ఆర్టీజీస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఈ ఏడాదిలో మరోసారి సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించుకున్నాం. ఆ దిశగా గృహ నిర్మాణ శాఖ వేగంగా పనిచేయాలి. టిడ్కో ఇళ్లు కాకుండానే మరో 5 లక్షలకు ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలి. ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసే విషయంలో ఎక్కడా ఆలస్యం కాకూడదు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నాం.. లబ్దిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఇది కొనసాగాలి. ఇళ్ల నిర్మాణంతోపాటు... ఇంటి స్థలాల పంపిణీ ప్రక్రియను వీలైనంత త్వరగా ప్రారంభించాలి. సుమారు 2 లక్షల మంది ఇళ్ల స్థలాలు కోరినట్టు సర్వేలో తేలింది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇళ్ల నిర్మాణాన్ని ఎంత వేగంగా చేపడుతున్నారో.. ఇళ్ల స్థలాల పంపిణీని కూడా అదే స్థాయిలో చేపట్టేలా ప్రణాళికలు సిద్దం చేయాలి. ఇక వర్షాకాలంలో ఇసుక సరఫరాలో ఇబ్బందులు రాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలకు ఇసుకను ఉచితంగా ఇస్తున్నాం. ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని వదులుకుంటున్నాం. రీచుల వద్ద, స్టాక్ యార్డుల వద్ద రవాణ పేరుతో కానీ... ఇతర పేర్లతో ఎక్కువ ఛార్జీలు వసూలు చేయడానికి వీల్లేదు. దీనిపై పటిష్ట నిఘా పెట్టాలి' అని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమీక్ష అనంతరం ఆర్టీజీఎస్ రూపొందించిన అవేర్2.0 మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఈతకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చువద్దు

### పిల్లలు ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరిన జిల్లా ఎస్పీ

ఒంగోలు : పరీక్షలు ముగిసి వేసవి సెలవులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులు, చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంగళవారం ఒక ప్రకటనలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు కోరారు. సరదా కోసం పిల్లలు, యువకులు గ్రామాలు, పట్టణాల శివార్లలోని కుంటలు, చెరువులు, కాలువలు, బావుల వద్దకు లేదా ఈతకు వెళ్లకుండా జాగ్రత్తపడాలని సూచించారు. గతంలో ఇలాంటి ప్రమాదకర జలాశయాల్లోకి వెళ్లి పలువురు మృత్యువాత పడి కుటుంబాలకు తీరని విషాదం మిగిల్చిన సంఘటనలు ఉన్నాయని ఎస్పీ ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. ఈతకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే సరదాగా వెళ్లిన పిల్లలు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఎక్కడికి వెళుతున్నారో తల్లిదండ్రులు గమనిస్తూ, పిల్లలు ఈతకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఈత రాకపోతే కలిగే ప్రమాదాల గురించి చిన్నారులకు అవగాహన కల్పించాలని సూచించారు. జలాశయాలు, బావులు, కాలువలు, చెరువులు, కుంటల్లో ఈత కొట్టేముందు, ఈత తెలిసిన వారు కూడా నీటి లోతును కర్రల సాయంతో ముందుగా పరిశీలించుకోవాలన్నారు. నీటి ప్రవాహ వేగం ఎక్కువగా ఉంటే ఈతకు వెళ్లకూడదని, విహారయాత్రలు లేదా తీర్థయాత్రలకు వెళ్లినప్పుడు లోతు తక్కువగా ఉన్న ప్రదేశాల్లోనే స్నానం చేయాలని, లోపలికి వెళ్లరాదని, ఈత రాకపోయినా స్నేహితులు బలవంతం చేయకూడదని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో చెరువులు, కొలనులు, జలపాతాలు, నీటి కుంటలు, ఏరుల వద్దకు ఎవరూ ఈతకు వెళ్లకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. చెరువులు, బావులు, కాలువల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, నీటి లోతును తెలియజేసే సూచనలు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట ముళ్ల కంచెలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే చిన్నారులు ఈతకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా ప్రమాదం సంభవించిన వెంటనే డయల్ 112 కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

## విజయ దుర్గమ్మ ఆలయంలో కాలసర్ప దోష నివారణ (రాహుకేతు) పూజలు

కడప : మహాదుర్గ,మహాలక్ష్మి, మహాసరస్వతి స్వరూపిణి అయిన శ్రీ విజయ దుర్గా దేవి అమ్మవారి ఆలయంలో రాహు కేతు పూజలు ఘనంగా నిర్వహించారు నవగ్రహాలు జగన్మాత శ్రీ విజయ దుర్గా దేవి ఆధీనంలో ఉంటాయి కనుక ఈ అమ్మవారి ఆలయంలో రాహు కేతు పూజలు నిర్వహించి అమ్మవారికి ప్రీతికరమైన రెండు నిమ్మ దీపాలను వెలిగించి పూజలు చేస్తే ఆ అమ్మవారి అనుగ్రహంతో తాము కోరుకున్న కోరికలను వెను వెంటనే నెరవేరుతున్నాయని వందలాదిగా వచ్చిన భక్తులు తెలియచేసారు అమ్మవారికి వేకువ జామున ప్రత్యేక అభిషేకం నిర్వహించారు అనంతరం అమ్మవారికి షోడశోపచార పూజలు నిర్వహించి,అమ్మ వారి దర్శనం అందించారు అర్చకులు అలాగే మాధ్యమం 3 నుండి 4.30 వరకు వేలాదిగా తరలి వచ్చి న భక్తులచే రాహుకేతు పూజలు నిర్వహింప చేశారు.

## ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేసిన "కన్నా"

మైలవరం : ప్రస్తుత వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్టీఆర్ జిల్లా మైలవరం పట్టణంలోని ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల వద్ద చలివేంద్రాలను గురజాల లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ కోడూరు మనోజ్ కుమార్ (కన్నా) మంగళవారం ఏర్పాటు చేశారు. ప్రస్తుత వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పాదచారులతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే వారి సౌకర్యార్థం వారి దాహార్తిని తీర్చేందుకు సంబంధిత శాఖల అధికారులు అడిగినదే తడవుగా చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. మైలవరం పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం వద్ద, మండల పరిషత్ కార్యాలయం వద్ద, పోలీస్ స్టేషన్ వద్ద ఈ చలివేంద్రాలను గురజాల లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ కోడూరు మనోజ్ కుమార్ సొంత నిధులతో ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాలను తాసిల్దార్ కార్యాలయం వద్ద తహసిల్దార్ అబ్దుల్ దరియా, మండల పరిషత్ కార్యాలయం వద్ద ట్రస్ట్ చైర్మన్ కన్నా, పోలీస్ స్టేషన్ వద్ద సర్కిల్ ఇన్స్పెక్టర్ కొత్తూరు కిషోర్ బాబు ప్రారంభించారు. ప్రారంభ సందర్భంగా ఆయా చలివేంద్రాల వద్ద మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురజాల లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడూరు మనోజ్ కుమార్ కన్నామాట్లాడుతూ ప్రస్తుత వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని పాదచారులు మరియు ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే వారి దాహార్తిని తీర్చేందుకు ఆయా శాఖల అధికారులు కోరిన మీదట చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చలివేంద్రాలు ఏర్పాటుతోపాటు ప్రతిరోజు ఆయా చలివేంద్రాలకు చల్లని మినరల్ వాటర్ ను సరఫరా చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. అడిగినదే తడవుగా చలివేంద్రాలను ఏర్పాటు చేసిన కోడూరు మనోజ్ కుమార్ కు ఆయా శాఖల అధికారులు, సిబ్బందితో పాటు పాదచారులు అభినందనలు, ధన్యవాదాలు తెలియజేశారు.

# ప్రజాహితమే ప్రధాన లక్ష్యం

### - మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

కొండపల్లి : కొండపల్లిలో సమస్యల తక్షణ పరిష్కారాలకు హామీ కొండపల్లి ఉదయం న్యూస్ ప్రజాహితమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. కొండపల్లిలోని పురపాలక సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సమస్యలను తెలుసుకున్నారు. 60 మంది అర్జీలు సమర్పించారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు క్షుణ్ణంగా విని, వాటికి సంబంధించిన అర్జీలను స్వీకరించారు. సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. హౌసింగ్, రెవెన్యూతో పాటు వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ, "ప్రజల సమస్యల పరిష్కారమే మా ప్రధాన లక్ష్యం. జనహితమే మనహితం అన్న నినాదంతో ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రతి సమస్యను బాధ్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరిస్తాం" అని అన్నారు. కొండపల్లి హిందూ శ్మశాన అభివృద్ధితో పాటు వివిధ సమస్యలపై చర్చించి, అందరూ ఐకమత్యంగా ఉందామన్నారు. జననివాస ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలు లేని చోట తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రజలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా కృషి చేస్తామని, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం పెరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహణ

తిరుపతి : ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం 9 గంటలకు స్థానిక డీఎంహెచ్వో కార్యాలయం నుండి స్విమ్స్ సర్కిల్ మీదుగా మెటర్నిటీ హాస్పిటల్ వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడమైనది .జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి.బాలకృష్ణ నాయక్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు .ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని ,ఆరోగ్యానికి మించిన సంపద లేదని ,ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని జీవనశైలి మార్చుకొని ఆనందంగా జీవించాలని కోరారు .ప్రతిరోజు వ్యాయామం చేయడం ,జంక్ ఫుడ్స్ మానడం, పరిశుభ్రత పాటించడం ,నూనెలు మసాలాలు తగ్గించడం, మితాహారం తీసుకోవడం, కూర గాయలు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవడం ,యోగా , ధ్యానం చేయడం వంటి ఆరోగ్య సూత్రాలు పాటించడం వల్ల ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చునని తెలిపారు .ఆరోగ్యమే మహా భాగ్యం,ఆరోగ్యానికి మించిన సంపద మరొకటి లేదు, ఇంటివంట ఆరోగ్యానికి మంచిది, ప్రతిరోజూ వ్యాయామం చేయండి,ఆరోగ్యంగా ఉండండి, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది, ఆరోగ్యంగా ఉండండి, ఆనందంగా జీవించండి అనే నినాదాలతో ర్యాలీ కొనసాగింది. ర్యాలీ అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం హెచ్ వో శ్రీనివాసులు రెడ్డి , ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ చక్రప్రకాశ్ రెడ్డి, డాక్టర్ రెడ్డిప్రసాద్, డిప్యూటీ డెమో బలరామరాజు , సి హెచ్ ఓ రత్నాకర్ , డి ఎం అండ్ హెచ్ ఓ కార్యాలయపు సిబ్బంది ,సుబ్బరాజు,రామాంజనేయులు రెడ్డి, అమరనాథరెడ్డి ,అర్బన్ పరిధిలోని ఏ ఎన్ ఎం లు, ఆశా కార్యకర్తలు,హెల్త్ అసిస్టెంట్లు, సెట్విన్ సంస్థ మేనేజర్ మోహనకుమార్,వారి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

# నర్సింగ్ విద్యార్థిని సుప్రియకు అండగా వుంటాం

తాడేపల్లి : వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత శ్రీ వైయస్ జగన్ను కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన నర్సింగ్ విద్యార్థిని సుప్రియ, ఆమె తల్లిదండ్రులు కలిసారు. తన తండ్రిపై నేరం మోపినందుకు ప్రశ్నించిన తనను పామర్రు సీఐ శుభాకర్, ఎస్సై భాస్కర్ స్టేషన్కు పిలిపించి దారుణంగా కొట్టడమే కాకుండా తనకు, తన కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని కలెక్టర్ గ్రీవియెన్స్ మీ కోసంలో కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీకి ఫిర్యాదు చేసిన వివరాలు వైయస్ జగన్కు చెప్పింది. కలెక్టర్ బాలాజీ తన అర్జీని తిరిగి పోలీసులకు అప్పగిస్తే అదే పోలీసులు తనపై సెక్షన్ 307 కింద కేసు పెట్టి రిమాండ్కు పంపారని, తర్వాత బెయిల్ పై విడుదలయినట్లు తన ఆవేదన చెప్పుకుంది. స్థానిక టీడీపీ నాయకుడు గణేష్ కోసం పోలీసులు తన కుటుంబంపై ఇంత దారుణంగా వ్యవహరించారని జగన్ వద్ద వాపోయిన సుప్రియ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉత్సాహంగా పనిచేస్తున్నామనే కారణంతో తన బాబాయి యాకోబు ఇంటిని టీడీపీ నేత గణేష్ తగలబెట్టించాడని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తన కుటుంబంపై కక్షకట్టి వేధింపులకు గురిచేస్తున్నారని కన్నీటిపర్యంతమైంది. బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న దళితురాలుపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్కు పంపడం దారుణమని మండిపడ్డ వైయస్ జగన్, సుప్రియకు అవసరమైన న్యాయసహాయం వైఎస్సార్సీపీ లీగల్ సెల్ అందిస్తుందని, సుప్రియ విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై జాతీయ ఎస్సీ కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్ళాలని పామర్రు వైఎస్సార్సీపీ ఇంఛార్జ్ కైలే అనిల్ కుమార్కు వైయస్ జగన్ సూచించారు.

# గంజాయి బ్యాచ్ అరెస్టు

తాడేపల్లి : తాడేపల్లి కృష్ణా కరకట్ట, పాటూరు, పరిసర ప్రాంతాల్లో గంజాయి,కలిగి ఉన్న, సేవిస్తున్న 8 మంది యువకులను తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నుండి 400 గ్రాముల గంజాయి పాకెట్ లను స్వాధీనం చేసుకున్నారు. గతంలో యువకులపై కేసులు ఉన్నట్టు సీఐ వీరేంద్ర బాబు తెలిపారు. 8 మంది యువకులను కోర్టు కు హాజరు పరిచినట్లు తాడేపల్లి సిఐ వీరేంద్రబాబు తెలియజేశారు.

## ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ సిబ్బందికి సన్ గ్లాసెస్ పంపిణీ : జిల్లా ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్ : ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్ సిబ్బందికి సన్ గ్లాసెస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.జానకి, స్వయంగా సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర డీజీపీ స్టోర్ ద్వారా పంపిణీ చేయబడిన సన్ గ్లాసెస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ట్రాఫిక్ సిబ్బంది తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ విధులు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా డిహైడ్రేషన్ సమస్యలు రాకుండా తరచూ నీరు, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవాలని తెలిపారు. విధుల్లో ఉండగా తప్పనిసరిగా టోపీ, సన్ గ్లాసెస్ ఉపయోగించాలి, లేమన్ వాటర్, బట్టర్‌మిల్క్ వంటి ద్రవాలను ఎక్కువగా తీసుకోవాలి వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప వైద్యసేవలను సంప్రదించాలి. విధుల సమయంలో అలసట, తలనొప్పి, తల తిరగడం వంటి లక్షణాలు ఉంటే అధికారులకు తెలియజేయాలి. రోజువారీ విధుల మధ్య చిన్న విరామాలు తీసుకుంటూ శరీరాన్ని చల్లగా ఉంచుకోవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి, ఆర్ఐ అడ్మిన్ కృష్ణయ్య, ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కడప నగరంలోని ఆలంఖాన్ పల్లి , అల్మాస్ పేట, మాసాపేట లలో కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్

### తనిఖీల్లో 30 ద్విచక్ర వాహనాలు, కత్తి స్వాధీనం

కడప : కడప నగరంలోని పలు ప్రాంతాలలో పోలీసులు కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించి పలువురు అనుమానితుల, పాత నేరస్థుల ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ముందుగా ఆలంఖాన్ పల్లిలో కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ లో జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అనుమానితులు, పాత నేరస్థుల ఇళ్లలో స్వయంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్మాస్ పేట సర్కిల్ వద్ద నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి జిల్లా ఎస్.పీ గారు గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. రౌడీ యిజానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మీడియా తో మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రిపూట రోడ్లపై అనవసరంగా తిరుగుతూ న్యూసెన్స్ చేసే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో రౌడీయిజానికి తావులేదని ఎస్.పీ తెలిపారు. గంజాయి బ్యాచ్ పై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల బద్వేలు, కమలాపురం లలో గంజాయి బ్యాచ్ లపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరిగిందని ఎస్.పీ వివరించారు. నగరంలో నిర్వహించిన కార్డన్ అండ్ సర్చ్, అర్ధరాత్రి వాహన తనిఖీల్లో 30 ద్విచక్ర వాహనాలను, ఓ కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

## మెహదీపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో బాలుడి హత్య..

టోలిచౌకి : ఓ బాలుడు హత్యకు గురైన ఘటన మేహిదిపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. టోలిచౌకి లో ఉన్న నైస్ జ్యూస్ సెంటర్లో పనిచేసే ఇద్దరు మధ్య గొడవ బాలుడి హత్యకు దారి తీసింది. జ్యూస్ సెంటర్లో పనిచేసే మోఫిల్ (19), గుల్జార్ ఆలం (16) మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చిన్న విషయమై గొడవపడ్డారు. ఆగ్రహానికి గురైన మోఫిల్ జ్యూస్ సెంటర్లోని ఒక గరిటె తీసుకొని గుల్జార్ ఆలం తలపై గట్టిగా కొట్టాడు. దీంతో ఆలం అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఇద్దరూ బీహార్ రాష్ట్రానికి చెందినవారుగా సమాచారం. కాగా నైస్ జ్యూస్ సెంటర్ రాత్రి మొత్తం తెరిచే ఉంటుందని, ఇంకా ఆలం మైనర్ కావడంతో ఓనర్ ఎలా షాపులో పనికి పెట్టుకున్నాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా సంబంధిత అధికారులు జ్యూస్ సెంటర్ యజమానిపై బాలుడు మృతికి కారణమైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు.

## ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తాం

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి కావడం దేవుడు మనకు ఇచ్చిన వరం అని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని ఆయన విమర్శించారు. హైదరాబాద్ మసాబ్ ట్యాంక్ లో టీఎన్జీవో రంగారెడ్డి జిల్లా యూనియన్ కార్యాలయాన్ని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ వైస్ చైర్మన్ ఫహీం ఖురేషి తో కలిసి స్పీకర్ ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు పని చేస్తున్నారని స్పీకర్ అన్నారు. ఉద్యోగుల సమస్యలను కూడా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. కొంగరకలాన్ లో ఉన్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని మార్చలనే ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నారని... హయత్ నగర్ పరిసరాల్లో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని చూస్తున్నారన్నారు. కార్యాలయం మార్పు తరువాత అక్కడే ఉద్యోగ సంఘం కార్యాలయానికి స్థల కేటాయింపుతో పాటు నిర్మాణం కూడా ప్రభుత్వం తరుపు చేయిస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ లు పాల్గొన్నారు

## సహ ఉద్యోగినిపై అత్యాచారం

సికింద్రాబాద్ : బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. ఏవికన్స్ పైలెట్ శిక్షణ సంస్థలో శిక్షణ తీసుకుంటున్న యువతిపై అదే సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగి అత్యాచారం చేసిన ఘటన కలకలం రేపింది. కేరళకు చెందిన నసిముద్దీన్ తనపై అత్యాచారానికి పాల్పడ్డట్లు యువతి బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేరళ ప్రాంతానికి చెందిన నసీముద్దీన్, దమ్మైగూడ కు చెందిన సల్మాన్ లు ఏవికన్స్ పైలెట్ శిక్షణ సంస్థ లో ఇన్స్ట్రక్టర్లుగా విధులు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో అదే సంస్థలో శిక్షణ తీసుకుంటున్న యువతి వాళ్లతో చదువుకుంటూ సోదర భావంతో ఉండేదని అన్నారు. నసీముద్దీన్ యువతితో సన్నిహితంగా మెలుగుతూ తన భార్య తనను మోసం చేసిందని ఆమెకు చెప్పి మానసికంగా లోపర్చుకొని ఆమెపై బలవంతంగా అత్యాచారం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. దమ్మాయిగూడ లో ఉండే సల్మాన్ ఇంటికి సైతం వెళ్లి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడేందుకు ప్రయత్నించినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న బేగంపేట పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# పీఓకే విలీనం అడుగులు




శ్రీనగర్ : 'పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) మళ్లీ భారత్‌లో అంతర్భాగం కాబోతోందా అంటే అవుననే అంటున్నారు విశ్లేషకులు. మౌద్యుల సంఘం అధ్యక్షుడు చేసిన ఈ వ్యాఖ్య కేవలం ఒక అభిప్రాయం కాదు.. భౌగోళిక, రాజకీయ మార్పులకు అద్దం పడుతోంది. పీవోకేలోని ముస్లింల మనస్తత్వంలో వస్తున్న మార్పు, పాకిస్తాన్‌పై వారిలో పెరుగుతున్న వ్యతిరేకత కారణమంటున్నారు. పీవోకేలోని ముస్లింలలో గతంలో ఉన్న భారత వ్యతిరేక ధోరణి ఇప్పుడు గణనీయంగా మారింది. 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ కశ్మీర్‌లో జరిగిన అభివృద్ధి, పర్యాటకం పెరుగుదల, ఉద్యోగావకాశాల పెరుగుదల వంటివి పీవోకే ప్రజల వైఖరిలో మార్పు తెస్తున్నాయి. తాము పాకిస్తాన్‌లో ఉండి అభివృద్ధికి దూరమయ్యామని వారు గుర్తిస్తున్నారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లపై పీవోకే ముస్లింలలో ఉన్న అనుకూలత క్షీణించింది. పాకిస్తాన్ తమను కేవలం భారత్‌పై కుట్రలకు ఉపయోగించుకుంటోందని, తమ అభివృద్ధిని పట్టించుకోవడం లేదని వారు గుర్తిస్తున్నారు. పాక్, బంగ్లాదేశ్ అనుకూలులలో కూడా భారత్ పట్ల అభిమానం పెరుగుతోంది. పాకిస్తాన్ ప్రభుత్వం పీవోకే ప్రజలపై చూపిస్తున్న నిర్లక్ష్యం, అణచివేత ప్రజలలో తిరుగుబాటుకు కారణమవుతోంది. పీవోకేలోని వనరులను పాకిస్తాన్ దోచుకుంటోంది. గోధుమ పిండిపై సబ్సిడీ లేదు, విద్యుత్ కోతలు, నిరుద్యోగం తాండవిస్తున్నాయి. పీవోకే అసెంబ్లీలో పాకిస్తాన్‌లో నివసిస్తున్న కాశ్మీరీ శరణార్థుల కోసం కేటాయించిన 12 సీట్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 2025 సెప్టెంబర్‌లో చరిత్రలోనే అతిపెద్ద నిరసన జరిగింది. పాక్ సైన్యం కాల్పుల్లో ఇద్దరు చనిపోయారు, 22 మంది గాయపడ్డారు. ఇంటర్నెట్ నిలిపివేత, పోలీసుల మోహరింపు జరిగాయి. పాకిస్తాన్ పీవోకేను ఉగ్రవాద స్థావరంగా మార్చి, యువకులను ఉగ్రవాదులుగా మార్చి భారత్‌పై పంపుతోంది. ఇది స్థానికులకు ప్రమాదకరంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో పీవోకే ప్రజలు తమ స్వరం వినిపిస్తున్నారు. పీవోకేలోని రాజకీయ కార్యకర్త అమ్జద్ అయూబ్ మిర్జా వీడియో ద్వారా, 'పాకిస్తాన్ తీరుతో విసిగిపోయాం, భారత్‌లో విలీనం కావాలి' అని డిమాండ్ చేశారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్, 'పీవోకేలోని ప్రజలే భారత్‌లో విలీనం కావాలని డిమాండ్ చేస్తున్నారు. అది త్వరలోనే జరుగుతుంది' అని ప్రకటించారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా, 'పీవోకే భారత్‌లో భాగమే, ఎప్పటికైనా స్వాధీనం చేసుకుంటాం' అని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు ప్రధాని మోదీ పది రోజుల్లో మూడు సార్లు పీవోకే గురించి ప్రస్తావించారు. పీవోకే భారత్‌లో విలీనం అనేది ఇక ఊహాగానం కాదు. అది సాధ్యమయ్యే లక్ష్యంగా మారింది. పాకిస్తాన్ తన తప్పుడు విధానాలతో పీవోకే ప్రజలను భారత్ వైపు నెడుతోంది. ముస్లింల మనస్తత్వంలో వస్తున్న మార్పు, పాకిస్తాన్ పట్ల వ్యతిరేకత పెరగడం ఇవన్నీ భారత్‌కు అనుకూలంగా మారుతున్న సంకేతాలు.

# కరీంనగర్ లో బీఆర్ఎస్ ప్లీనరి

కరీంనగర్ : కేసీఆర్ మాటలనే అస్త్రాలుగా వాడతారు. పదునైన తన డైలాగులతో ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తారు. తీరా చూస్తే ఆచరణలో అవి పెద్దగా ముందుకు సాగవని విమర్శలు ఉన్నాయి. దానికి ఉదాహరణలు కూడా ఉన్నాయి. కేసీఆర్ గత ఏడాది పార్టీ ప్లీనరీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగం కనుక చూస్తే తాను ఇక నుంచి జనంలో ఉంటాను అన్ బిగ్ స్టేట్మెంట్ ఇచ్చేశారు. ఈ రోజు నుంచి మీటింగుల మీద మీటింగులే, జనంలో ఉంటూ కాంగ్రెస్ సర్కార్ ని నిలదీస్తామని అన్నారు. కానీ ఆ తరువాత కేరాఫ్ ఫాం హౌస్ గానే కథ సాగింది. మళ్ళీ గత ఏడాది డిసెంబర్ నెలలో కేసీఆర్ మీడియా ముందుకు వచ్చరు. ఆయన మాట్లాడుతూ ఇక మీదట జనంలో ఉంటాం, కొత్త ఏడాది అంటీఅ 2026లో వరసగా అనేక జిల్లాలలో మీటింగ్స్ పెడతాం, ఇక సమరమే అని గర్జించారు. కానీ అది కూడా జరగలేదు. చూస్తూండగానే ఏడాది గడచిపోయింది. ఇక ఈసారి ప్లీనరీ ఎక్కడ అన్న చర్చ బీఆర్ఎస్ పార్టీలో సాగుతోంది. అయితే ఉమ్మడి కరీం నగర్ జిల్లాలో నిర్వహిస్తారు అని అంటున్నారు. దానికి కారణం ఉత్తర తెలంగాణాలో బీఆర్ఎస్ కారు జోరు తగ్గిది అన్న భావన ఉండడమే. 2023 ఎన్నికల్లో కూడా బలమైన ఈ ప్రాంతంలో సరిగా వర్క్ చేసుకోకపోవడం వల్ల దక్కాల్సిన సీట్లు కూడా దక్కలేదు అన్న భావనతో బీఆర్ ఎస్ పెద్దలు ఉన్నారుట. ఉద్యమ కాలం నుంచి కూడా తమకు అన్ని విధాలుగా కలిసి వచ్చి అచ్చి వచ్చిన ఉమ్మడి కరీంనగర్ లోనే ప్లీనరీ పెడితే అది మంచి ఊపు ఇస్తుందని ఆ మీదట రానున్న కాలమంతా బీఆర్ఎస్ కారు స్పీడ్ అందుకుంటుందని లెక్కలేస్తున్నారు అంతే కాదు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిర్వహించే భారీ ప్లీనరీలోనే కాంగ్రెస్ కి రాజీనామా చేసి బయటకు వచ్చిన సీనియర్ నేత మాజీ మంత్రి టీ జీవన్ రెడ్డిని కండువా కప్పి చేర్చుకుంటారు అని అంటున్నారు. ఆ విధంగా తమ బలం పెరిగింది అన్న సందేశాన్ని ఈ సభ సాక్షిగా ఇస్తారు అని అంటున్నారు. రాజకీయ అనుభవంలోనూ సీనియారిటీలోనూ కేసీఆర్ కి సమకాలీనుడు సరి జోడు అయిన జీవన్ రెడ్డి చేరికను కూడా ఒక సంబరంగా నిర్వహించి క్యాడర్ కి సందేశం ఇవ్వాలని చూస్తున్నారుట. ఇవన్నీ పక్కన పెడితే ఈ ప్లీనరీ తరువాత అయినా కేసీఆర్ జనంలోకి వస్తారా గట్టిగా మాట్లాడుతారా అన్న చర్చ సాగుతోంది. ఈ నెల 27న బీఆర్ఎస్ ప్లీనరీ ఉంది. ఆ సభలో కేసీఆర్ ఏమి మాట్లాడుతారు అన్నది కూడా అంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే గత ప్లీనరీలో కేసీఆర్ ప్రసంగంలో పస లేదని సొంత కుమార్తె నాటి బీఆర్ ఎస్ మహిళా నాయకురాలు అయిన కవిత సంధించిన లేఖాస్త్రాలు అప్పట్లో వైరల్ అయ్యాయి. బీజేపీని విమర్శించడంలో పెద్దగా ఫోకస్ పెట్టలేదని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. మరి ఈసారి కేసీఆర్ ఏ అస్త్రాలను సిద్ధం చేసుకుని సభకు వస్తున్నారో చూడాల్సి ఉంది అని అంటున్నారు.

## సర్కారీ కొలువుల్లేకపోయినా.. భారీగా ఉద్యోగాలు

హైదరాబాద్ : ఆసక్తికర లెక్కలు వెలుగు చూశాయి. తెలంగాణ రాష్ట్రం కొలువులకు కేరాఫ్ అడ్రస్ గా మారుతోంది. దేశ వ్యాప్తంగా ఉన్న ఐటీ కొలువులు మాత్రమే కాదు.. పారిశ్రామిక రంగాల విస్తరణతో పాటు.. కొత్త సంస్థలు కొలువు తీరటంతో పాటు.. సేవా రంగం భారీ ఎత్తున విస్తరిస్తున్న వేళ.. ఉపాధి కల్పనలో తెలంగాణ రాష్ట్రం దూసుకెళుతోంది. కాకి లెక్కలు కాకుండా.. ఉద్యోగులు ఎవరైనా సరే.. ఈపీఎఫ్ వో వద్ద నమోదయ్యే గణాంకాల ప్రకారం చూస్తే.. ఆశ్చర్యానికి గురి చేసే గణంకాలు తెర మీదకు వచ్చాయి. గడిచిన ఎనిమిది నెలల విషయాన్నే తీసుకుంటే.. దాదాపు 3.12 లక్షల మంది తొలిసారి ఉద్యోగాల్లో చేరినట్లుగా వెల్లడైంది. ఈ కొలువుల్లో అధిక నైపుణ్యం ఉన్న ఉద్యోగాలు మాత్రమే కాదు.. మధ్యస్థాయి కొలువులు సైతం గణనీయంగా పెరిగిన విషయం వెల్లడైంది. ఈ పెరిగిన కొలువుల్లో కీలకభూమిక పోషించింది మాత్రం హైదరాబాద్.. రంగారెడ్డి జిల్లాలే అని చెప్పాలి. ఈపీఎఫ్ వో గణాంకాల్ని పరిశీలిస్తే రాష్ట్రవ్యాప్తంగా 55.42 లక్షల మంది పని చేస్తున్నట్లు తేలింది. ఇందులో ఒక్క హైదరాబాద్.. రంగారెడ్డి జిల్లాల్లోనే 42.8 లక్షల మంది ఉండటం గమనార్హం. ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే 31.39 లక్షల మంది ఉద్యోగులు ఉన్నట్లుగా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. హైదరాబాద్ మహానగరంలోని అత్యధిక ప్రాంతం ఈ రెండు జిల్లాల్లోనే ఉందన్న సంగతి తెలిసిందే. గడిచిన ఐదేళ్లలో దాదాపు 7.23 లక్షల మందికొత్తగా ఉద్యోగాల్లోకి వచ్చారు. రంగారెడ్డి జిల్లాలో 4 లక్షల ఉద్యోగాలు వచ్చాయి. అదే సమయంలో నిజామాబాద్.. ఆదిలాబాద్ జిల్లాల్లో మాత్రం ఉద్యోగుల సంఖ్య కాస్త తగ్గింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో (2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు మధ్యకాలం) కొత్తగా వచ్చిన ఉద్యోగాలు భారీగా వచ్చాయి. గడిచిన ఐదేళ్లలో వచ్చిన ఉద్యోగాల్లో దాదాపు 30 శాతానికి పైనే ఉండటం ఆసక్తికరంగా మారింది. ఇదంతా చూస్తే.. హైదరాబాద్ కొలువులకు నెలవుగా మారటమే కాదు.. మహానగర స్థాయి ఏమిటన్న విషయాన్ని చెప్పకనే చెప్పేస్తుందని చెప్పాలి.

# రేవంత్ హిందూత్వ అస్త్రం



హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవలి కాలంలో బాసర, భద్రాద్రి, వేములవాడ వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారి తీస్తోంది. కేవలం పరిపాలనకే పరిమితం కాకుండా, ఆధ్యాత్మిక కేంద్రాల పునరుద్ధరణకు వందల కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తూ ఆయన చేస్తున్న పర్యటనలు కేవలం భక్తి కోణంలోనే కాకుండా, ఒక పక్కా రాజకీయ వ్యూహంతో కూడినవిగా భావిస్తున్నారు. తెలంగాణలో బీజేపీ తన హిందూత్వ నినాదంతో బలపడుతున్న తరుణంలో, ఆ ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి రేవంత్ రెడ్డి సాఫ్ట్ హిందూత్వ మార్గాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. గతంలో కాంగ్రెస్ పార్టీపై ఉన్న మైనారిటీ అనుకూల పార్టీ అనే ముద్రను చెరిపివేయకుండా మెజారిటీ హిందూ ఓటర్లకు చేరువయ్యేందుకు ఆయన ఈ ఆలయాల అభివృద్ధిని ఒక వేదికగా చేసుకుంటున్నారు. బీజేపీ చేసే మతపరమైన విమర్శలకు అవకాశం ఇవ్వకుండా, తాము కూడా హిందూ ధర్మాన్ని, సంస్కృతిని గౌరవిస్తామని చేతల్లో చూపిస్తున్నారు. తెలంగాణలో హిందూ ఓట్లే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీజేపీకి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో అడ్డుకట్ట వేస్తున్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణలోని స్థానిక సెంటిమెంట్లతో ముడిపడి ఉన్న బాసర , భద్రాద్రి, వేములవాడ వంటి క్షేత్రాలకు పెద్దపీట వేస్తున్నారు. బాసర ఆలయ అభివృద్ధికి రూ. 225 కోట్లు కేటాయించడం, తిరుమల తరహాలో అక్కడ రాజకీయ కార్యకలాపాలను నిషేధించాలని ఆదేశించడం ద్వారా ఆయన ఆధ్యాత్మికతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనే సంకేతాలను ప్రజల్లోకి పంపారు. కేవలం ఆలయాల అభివృద్ధి మాత్రమే కాకుండా, గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఆలయాలను బాగు చేయడం ద్వారా ప్రజల మనసు గెలుచుకోవాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. యాదగిరిగుట్టను బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేసినప్పటికీ, భద్రాద్రి వంటి ఇతర కీలక ఆలయాలను వదిలేశారనే విమర్శలు ఉన్నాయి. ఆ లోటును భర్తీ చేస్తూ, భద్రాద్రి మాస్టర్ ప్లాన్‌ను స్వయంగా సమీక్షించడం ద్వారా రేవంత్ రెడ్డి తనను తాను ఒక ప్రజా పక్షపాత ఆధ్యాత్మిక వాది గా ప్రాజెక్ట్ చేసుకుంటున్నారు. రేవంత్ రెడ్డి వ్యూహం కేవలం హిందూత్వకే పరిమితం కాలేదు. ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే, మరోవైపు ఆలయాల అభివృద్ధిపై దృష్టి పెట్టడం ద్వారా అన్ని వర్గాల ఓటర్లను ఆకట్టుకోవాలని చూస్తున్నారు. బీజేపీ నాయకులు చేసే యాంటీ-హిందూ విమర్శలకు బాసర, వేములవాడ అభివృద్ధి పనులే సమాధానంగా ఆయన భావిస్తున్నారు. ఇది కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకుతో పాటు, మధ్యతరగతి హిందూ ఓటర్లను కూడా దగ్గర చేసే అవకాశం ఉంది. రేవంత్ రెడ్డి ఆలయాల చుట్టూ తిరుగుతున్న రాజకీయాలు తెలంగాణలో త్రిముఖ పోటీని ఆసక్తికరంగా మార్చాయి. బీజేపీ హిందూత్వ నినాదానికి, కాంగ్రెస్ సాఫ్ట్ హిందూత్వ, అభివృద్ధి నినాదానికి మధ్య ఈ పోటీ సాగుతోంది. ఈ వ్యూహం గనుక ఫలిస్తే, భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ పెరగకుండా అడ్డుకోవడంలో రేవంత్ రెడ్డి విజయవంతమైనట్లే. అయితే, ఈ ఆధ్యాత్మిక పనులు కేవలం శంకుస్థాపనలకే పరిమితం కాకుండా, గడువులోగా పూర్తయితేనే ప్రజల్లో ఆయనపై ఉన్న నమ్మకం మరింత బలపడుతుంది.

# తారామతి పార్టీలో ఎందరెందరో?

హైదరాబాద్ : తారామతి బారాదరి రిసార్ట్ లో ఏర్పాటు చేసిన పార్టీలో డ్రగ్స విినియోగం జరగటం.. శనివారం అర్ధరాత్రి ఈగిల్ పోలీసులు తనిఖీలు నిర్వహించటం ఆరుగురు డ్రగ్స్ వినియోగం జరిపినట్లుగా గుర్తించి.. వారిని డీ అడిక్షన్ సెంటర్ కు తరలించటం తెలిసిందే. చారిత్రక కట్టడంగా గుర్తింపు పొందిన ఇందులో నిర్వహించిన మత్తుపార్టీలో పెద్ద ఎత్తున లిక్కర్ సర్వ్ చేయటం షాకింగ్ గా మారింది. కారణం.. ఈ పార్టీకి సంబంధించి ఎక్సైజ్ శాఖ నుంచటి అనుమతులు తీసుకోకుండానే పెద్ద ఎత్తున మద్యాన్ని వచ్చిన అతిధులకు అందించటం చూస్తే.. నిబంధనల్ని ఏ మాత్రం పట్టించుకోలేదన్న విషయం అర్థమవుతుంది. ఈ పార్టీకి దాదాపు 400 మంది వరకు వచ్చినట్లుగా తెలుస్తోంది. వీరిలో 35 మందిని పరీక్షించినట్లుగా చెప్పినా.. దాదాపు అరవై మంది వరకు పరీక్షలు జరిపారని తెలుస్తోంది. వీరిలో ఆరుగురు డ్రగ్స్ తీసుకున్నట్లుగా గుర్తించారు. వీరిలో బాలీవుడ్ నటుడు కం మోడల్ అబ్దుల్ నర్వర్.. యోగేశ్వర్.. అభినాశ్ ఫణి.. బ్రెట్ జానస్.. నిహార్, ఆషి (వీరిద్దరూ భార్యభర్తలు) కొకైన్ తీసుకున్నట్లుగా తెలుస్తోంది. మోరే దేన్ ఫ్రెండ్స్ పేరుతో నిర్వహించిన ఈ మత్తు పార్టీ కపుల్ ఫ్రెండ్లీగా పెద్ద ఎత్తున ప్రచారం చేయటం గమనార్హం. ఈ కారణంతో వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున జంటలు రావటం విశేషం. ఈ ఈవెంట్ గురించి హైదరాబాద్ కంటే ఎక్కువగా ఢిల్లీ.. ముంబయి.. బెంగళూరు నుంచి విద్యార్థులు.. యూత్ హాజరైనట్లుగా గుర్తించారు. ఈ పార్టీని నిర్వహించిన వ్యక్తిని చంద్రగా భావిస్తున్నారు. తెర వెనుక వేరే వారు ఉంటారని తెలుస్తోంది. వీరికి డ్రగ్స్ ఎలా వచ్చాయన్న దానిపై ఇప్పుడు ఫోకస్ చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు తీసుకోకుండా ఈ పార్టీని నిర్వహించటం చూస్తే.. అంత పబ్లిక్ గా పార్టీ నిర్వహనస్తూ కనీస అనుమతులు తీసుకొని బరితెగింపు ఏమిటి? అన్నది ప్రశ్న. తారామతి బారాదరిలో నిర్వహించిన ఈవెంట్ ను మ్యూజిక్ జోనర్ ఇష్టపడే వారి కోసమన్నట్లుగా ప్రచారం జరిగింది. 400 ఏళ్ల నాటి గోల్కొండ కోట పరిసరాల్లో.. ఆధునిక లైటింగ్ మధ్య భిన్నమైన సౌండ్ సిస్టమ్ తో విభిన్నమైన వాతావరణాన్ని క్రియేట్ చేస్తున్నట్లుగా భారీ ప్రచారం చేయటంతో ఆ పార్టీకి వేర్వేరు నగరాల నుంచి పెద్ద ఎత్తున హాజరైనట్లుగా చెబుతున్నారు. పోలీసుల దాడుల్లో నాలుగు గ్రాముల కొకైన్.. నాలుగు గ్రాముల ఎండీఎంఏ పిల్స్ తో పాటు ఇతర మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలు నిర్వహించిన తర్వాత డ్రగ్స్ వినియోగంతో సంబంధం లేని వారి వివరాల్ని సైతం పోలీసులు సేకరించి పంపినట్లుగా తెలుస్తోంది.

## గోరక్షకుడిపై దాడి.. హిందూ సంస్థల నిరసన

హైదరాబాద్ : హైదరాబాద్ కమిషనరేట్ మీర్పేట్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. అక్రమంగా తరలిస్తున్న గోవులను ఆపే ప్రయత్నం చేసిన గోరక్షకుణ్ణి కర్మన్ఘాట్ హనుమాన్ టెంపుల్ సమీపంలో దుండగులు దారుణంగా దాడి చేశారంటూ మహేశ్వరం బిజెపి నాయకుడు అందేల శ్రీరాములు, బిజెపి శ్రేణులు నిరసనకు దిగారు. అక్రమంగా తరలిస్తున్న గోవులపై పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ కూడా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. గో రక్షకుని పై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఈరోజు సాయంత్రం వరకు నిందితుల పై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున నిరసనలు చేస్తామని హెచ్చరించారు.

## పీఎం శ్రీ కుసంగి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నమోదుకు స్పెషల్ డ్రైవ్

పటాన్ చెరు : టేక్మాల్ మండల పరిధిలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుసంగి లో 2026- 27 విద్యా సంవత్సరానికి గాను నూతన విద్యార్థుల అడ్మిషన్ కొరకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి ప్రసన్న వదన ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మూడు బృందాలుగా ఏర్పడి కుసంగి, కిచన్నపల్లి, మల్కాపూర్ పాఠశాలలో చదువుతున్న ఐదవ తరగతి, ఏడవ తరగతి పూర్తయిన విద్యార్థులను పై తరగతిలో చదువుకొనుటకు తమ పాఠశాలలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలుపుతు ఇంటింటి క్యాంపెనింగ్ చేపట్టారు. ప్రభుత్వ పాఠశాల కుసంగిలో చేపడుతున్న పాఠ్య సహ పాఠ్య కార్యక్రమాల బ్రోచర్ల ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాండు రంగం, అశోక్, శంకర్, రమేష్ గౌడ్, మురళి, సుభాష్, కళ్యాణి, నాగేందర్ రెడ్డి ,రాకేష్, రాములు, సిఆర్పి మొగులయ్య సీఓ మల్లేష్ గౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెట్రో సిటీటైమ్స్ METRO CITY TIMES శుక్రవారం, ఏప్రిల్ 10, 2026

# లేబర్ కార్మికులకు ఫంక్షనల్ ఏర్పాటు చేయాలి

జయశంకర్ భూపాలపల్లి : జిల్లా కేంద్రంలో వున్న స్థానిక కలెక్టర్ కార్యాలయంలో లేబర్ కార్మికులకు ఫంక్షనల్ ఏర్పాటు చేయాలి అని కార్మికుల కు అడ్డ ఏర్పాటు చేయాలని లేబర్ కార్డు ఉంటే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయాలి అని వినతి పత్రం అందజేయడం జరిగింది అని ఆమ్ ఆద్మీ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ నాగుల అరవింద్ అన్నారు అనంతం వారు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి లో భాగస్వామ్యం లో ప్రధాన భూమిక పోషిస్తున్న కార్మికుల కుటుంబాలలో శుభ కార్యక్రమం కు ఇతర కార్యక్రమాలకు ఫంక్షనల్ లేకపోవడంతో కార్మికులందరూ ఇబ్బందులకు గురవుతున్నారు అని అదేవిధంగా కార్మికులందరికీ లేబర్ అడ్డ ను ఏర్పాటు చేయాలని కోరారు ఒక అడ్డా లేకపోవడంతో కార్మికులందరికీ పని దొరకపోవడంతో పాటు పని చేయించుకునే ఇంటి యాజమాన్యాని కూడా ఇబ్బంది పడుతున్నారు అడ్డ ఉంటే ఇరువురికి ఇబ్బంది ఉండదు అతి ముఖ్యంగా నిజమైన కార్మికుడికి లేబర్ కార్డులు జిల్లా వ్యాప్తంగా చాలా మందికి లేవు వారందరిని గుర్తించి అర్హులైన వారందరికీ లేబర్ కార్డులో ఇవ్వాలి అదేవిధంగా లేబర్ కార్డు ఉండడం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను జిల్లా కార్మిక శాఖ నుంచి అన్ని గ్రామాలలో ఎక్కువ మొత్తంలో కరపత్రాల ద్వారా ఆటో ద్వారా వేరే ఇతర మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలి అని నాగుల అరవింద్ తెలియజేశారు.

### ఉద్యోగుల నిరంతర కృషితోనే

# విద్యుత్ శాఖకు మంచి పేరు వచ్చింది

### - మంత్రి గొట్టిపాటి రవికుమార్

అమరావతి : రాష్ట్ర విద్యుత్ సంస్థ నూతన కార్పొరేట్ కార్యాలయాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం ప్రారంభించారు. రూ.30 కోట్లతో విద్యుత్ శాఖ నూతన కార్పొరేట్ కార్యాలయాన్ని నిర్మించింది. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశయ సాధన దిశగా విద్యుత్ ఉద్యోగులు పనిచేయడం హర్షణీయం. విద్యుత్ ఉద్యోగుల నిరంతర కృషితోనే విద్యుత్ శాఖకు మంచి పేరు వచ్చింది. పీఎం సూర్యఘర్, కుసుమ్ పథకాల అమలలో ఉద్యోగులు పాత్ర చాలా కీలకం. వరదలు సమయంలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా విద్యుత్ ఉద్యోగులు పని చేశారు. విద్యుత్ చార్జీలు పెంచకుండా నిరంతరాయ విద్యుత్తును కూటమి ప్రభుత్వం అందిస్తోంది.లో ఓల్టేజి సమస్యలు లేకుండా రాష్ట్రవ్యాప్తంగా సబ్ స్టేషన్ల నిర్మాణం జరుగుతోంది. గతంలో ఎన్నడలేని విధంగా రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంని అన్నారు. విద్యుత్ చార్జీలు పెంచకూడదనే సీఎం ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల్లో విద్యుత్ శాఖపై సంతృప్తి స్థాయి పెరుగుతోందని అన్నారు.

# మంత్రి లోకేష్ ను కలిసిన రైల్వే సిబ్బంది

మంగళగిరి : మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో 87వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించాను. సామాన్యులు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించాను. సౌత్ కోస్ట్ రైల్వే ఏర్పాటు నేపథ్యంలో విజయవాడలోని లోకో పైలట్ల గాలా డిపోను తరలించకుండా చూడాలని సిబ్బంది విజ్ఞప్తి చేశారు. కోవిడ్ వల్ల నష్టపోయిన హైర్ బస్ యజమానుల బస్సులకు రీప్లేస్ మెంట్ కల్పించి ఆదుకోవాలని యజమానులు కోరారు. వంశపారంపర్యంగా సంక్రమించిన తమ 2.63 ఎకరాల భూమిని ఆక్రమించారని, విచారించి న్యాయం చేయాలని కర్నూలు జిల్లా గుండంపాడుకు చెందిన ఎస్.చిన్న శివమ్మ కోరారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చాను.

# అతివేగంతో అదుపు తప్పి పల్టీలు కొట్టిన కారు.. ఇద్దరు స్పాట్‌డెడ్

హైదరాబాద్ : వనస్థలిపురంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్ చేయడంతో కారు అదుపు తప్పి పల్టీలు కొట్టింది. నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి, బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరు విద్యార్థులు, మరో వ్యక్తి చనిపోయారు. మృతి చెందిన ఇద్దరు విద్యార్థులు ఇంజినీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్న శివ, సందీప్ జోహెల్‌గా గుర్తించారు. కారు డ్రైవర్‌ను తమకు అప్పగించాలని కళాశాల విద్యార్థులు రోడ్డుపై ఆందోళనకు దిగారు.

# మియాపూర్ పీఎస్ ముందు బీఆర్ఎస్ అందోళన

హైదరాబాద్ : మియాపూర్ పోలీసు స్టేషన్ ముందు బీఆర్ఎస్ నేతలు అందోళనకు దిగారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఒత్తిళ్లకు తల్గొగ్గి బీఆర్ఎస్ నాయకులు పై అక్రమ కేసులు మియాపూర్ పోలీసులు నమోదు చేసారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతల రవి యాదవ్ బీఆర్ఎస్ లీగల్ టీం తో కలిసి విచారణ కు హాజరైయారుఏ. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ లీగల్ టీం సభ్యులు మాట్లాడుతూ రవి యాదవ్ మీద మియాపూర్ పోలీసులు ఇల్లీగల్ ఎఫ్ఐఆర్ ఖీ నమోదు చేయడం జరిగింది. సెక్షన్ 352, 356 కింద కేసు నమోదు చేశారు. రీసెంట్ గా సుప్రీం కోర్ట్ నల్ల బాలు కేసులో జడ్జి మెంట్ ఇచ్చిన విషయాన్నీ ప్రస్తావించారు. నల్ల బాలు కేసులో ఎవరైతే బాధితుడు ఉన్నాడో అతనే కంప్లైంట్ ఇవ్వాలి.. కంప్లైంట్ చేసిన వెంటనే ఈఎఫ్ఐ నమోదు చేయవద్దని హై కోర్ట్, సుప్రీం కోర్ట్ జడ్జ్ మెంట్ ఉందని గుర్తు చేశారు. పోలీసులు హై కోర్ట్, సుప్రీం కోర్ట్ జడ్జ్ మెంట్ లను వాయిలెట్ చేశారు. రాజకీయ ప్రలోభాలకు లోబడి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవి యాదవ్ మీద తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. బీఆర్ ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెడితే బీఆర్ఎస్ శ్రేణులకు లీగల్ టీం సపోర్ట్ గా ఉంటుంది. ప్రాపర్ గా ఇన్వెస్ట్ గెషన్ చేసి కేసు క్లోజ్ చేయకపోతే హై కోర్ట్ కు వెళ్లి డిఫమేషన్ సూట్ వేస్తాం.. ఇలాంటి తప్పుడు కేసులు పెడితే ప్రజలకు పోలీసు వ్యవస్థ మీద ఉన్న నమ్మకం పోతదని అన్నారు.

# బంజారా లేక్ కబ్జాకు గురి అవుతుందని ఎమ్మెల్యే ఫిర్యాదు

### - చెరువు పరిసర ప్రాంతాల్లో పర్యటించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్ : బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 1 లోని బంజారా హోటల్ పక్కన ఉన్న చెరువు కబ్జా కు గురి అవ్వుతుందని స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, స్థానికులు ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ లు చెరువు పరిసర ప్రాంతాలను పర్యటించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ బంజారా లేక్ గా ప్రసిద్ధి గాంచిన ఈ చెరువు పూర్తిగా కలుషితం అవడమే కాకుండా కబ్జా లకు గురివుతుందని స్థానిక ఎమ్మెల్యే దానం, కాలనీ వాసులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ చెరువు గతంలో నలభై ఏళ్ల క్రితం స్వచ్ఛమైన నీటితో ఉండేదని, ప్రస్తుతం దుర్గంధంతో అత్యంత దయనీయస్థితిలో ఉందన్నారు. ఈ చెరువు ఎఫ్ టి ఎల్ పరిధిలో పలు భవనాలు నిర్మాణం అయ్యాయని తెలిపారు. చెరువు పక్కన ఉన్న ఆలయంలో పండగలు జరుపుకునే పరిస్థితి లేదని, ఎఫ్ టి ఎల్ పరిధిలో రోడ్డు వేసి అన్యాక్రాంతం చేశారని స్థానికులు ఫిర్యాదు చేశారన్నారు. వీరి ఫిర్యాదు పై ఎంక్వయిరీ చేసిన పిదప తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ మంచి నీటితో పలు కాలనీ వాసులు ఈ చెరువు నీటిని గతంలో వాడుకునే వారని, ఇదే చెరువులో బతుకమ్మ, వినాయక నిమజ్జనాలు కూడా జరిగేవని, చుట్టు ప్రక్కన ఉన్న అన్ని కమర్షియల్ భవనాల సీవరేజ్ పైపుల నుండి కలుషిత జలాలు ఈ చెరువులో చేరడం వలన దుర్గంధ భరితంగా మారిందన్నారు. ఇలానే నగరంలో మరి కొన్ని చెరువులు, స్థలాలు కబ్జాకు గురి అయిన వాటి గురించి హైడ్రా కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ చెరువు కబ్జా విషయమై ఫిర్యాదు చేసిన తక్షణమే స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు ధన్యవాదాలు తెలిపారు.

# పేదలకు బాసట సీఎం సహాయనిధి

భైంసా : పేద ప్రజలకు ఆపద్బాంధవంగా నిలుస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ 144 మంది లబ్ధిదారులకు రూ.35.50 లక్షల చెక్కులు అందజేశారు. ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటివరకు 4 వేల మందికి పైగా లబ్ధిదారులకు సహాయనిధి అందించామని తెలిపారు. నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం 400 మందికి ఎల్.ఓ.సీలు మంజూరు చేయించామని చెప్పారు. ప్రజలకు మరింత సులభంగా సేవలు అందించేందుకు తన నివాసంలో ప్రత్యేకంగా సీఎం సహాయనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్య, వైద్యం, సాగునీరు రంగాల అభివృద్ధే తన లక్ష్యమని తెలిపారు. రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బాసర ఆలయ అభివృద్ధికి రూ.225 కోట్ల నిధులు మంజూరై శంకుస్థాపన జరగడం ఆనందకరమన్నారు. అదే విధంగా కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు, ఆసుపత్రుల అభివృద్ధి, 28 ప్యాకేజీ నిధుల సాధనకు కృషి చేస్తానని తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తి అయితే తానూర్, కుభీర్ మండలాలు సస్యశ్యామలంగా మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, ప్రజాప్రతినిధులు వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

మంగళగిరి : యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి, మరింత మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియ జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తమ ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. నాగార్జున యూనివర్శిటీలోని డాక్టర్ హెచ్.హెచ్.డైక్ మన్ ఆడిటోరియంలో నిర్వహించిన ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు అవకాశాలపై ఒకరోజు అవగాహన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, అనంతరం మంత్రి సవిత ప్రసంగించారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో చిన్న,మధ్యతరహా పరిశ్రమలకు ఏర్పాటుపై అగ్ర కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు మేలు కలుగజేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంద న్నారు. ఇంతకుముందు ప్రకృతి వ్యవసాయంతో ఎలా లాభాలు ఆర్జించ వచ్చో అవగాహన సదస్సు నిర్వహించారన్నారు. ఇప్పుడు ఉపాధి కల్పనపై మరో అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈడబ్ల్యూఎస్ వర్గీయుల పేదరికాన్ని పారదోలడానికి కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. దేశ పారిశ్రామిక రంగంలో ఏపీని అగ్రగామిగా నిలబెట్టడానికి సీఎ చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రేయింబవళ్లు కృషి చేస్తున్నారని మంత్రి సవిత వెల్లడించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కేవలం 22 నెలల కాలంలోనే ఏపీకి రూ.25 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పార్కుల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసే పెట్టుబడి దారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తోందన్నారు. తక్షణ అనుమతులకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయులకు బీసీ సంక్షేమ శాఖ ద్వారా అండగా నిలుస్తామన్నారు. ఆసక్తి కలిగిన యువత డీపీఆర్ లతో ముందుకొస్తే, చిన్న,మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలు, ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తామని మంత్రి సవిత తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు.

ఇందులో భాగంగా నిర్వహిస్తున్న ఒక రోజు సదస్సును ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గానికి చెందిన యువత, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యువతే భారత దేశ బలమని, వారి చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని అన్నారు. అందుకే సీఎం చంద్రబాబు అన్నింటా యువతకు ప్రాధాన్యమిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ ల కంటే పారిశ్రామికవేత్తలుగా తోటి నిరుద్యోగులకు ఉపాధి కల్పించే అవకాశం కలుగుతుందన్నారు. పారిశ్రామిక వేత్తలు గా మహిళలు రాణిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి సవిత తెలిపారు.

రాష్ట్ర ఈడబ్ల్యూఎస్ శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి కె.సునీత మాట్లాడుతూ, అగ్ర కులాల్లో పేదరికంతో బాధపడే వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ సీఈవో ఎం.విశ్వ, వీసీ గంగాధర్ రావు, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు బుచ్చి రాంప్రసాద్, బ్రహ్మం చౌదరి, డైరెక్టర్లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయులు తదితరులు పాల్గొన్నారు.

# అతివిశ్వాసమా? వ్యూహాలోపమా?



చెన్నై : తమిళనాడు రాజకీయాల్లో దళపతి విజయ్ తన తమిళగ వెట్రి కళగం పార్టీతో ఒక సంచలనంలా మెరిసినప్పటికీ, ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ క్షేత్రస్థాయిలో ఆయన ఎదుర్కొంటున్న సవాళ్లు ఆయన్ని వెనుకబడిపోయేలా చేస్తున్నాయి. ఏప్రిల్ 23, 2026న జరగనున్న పోలింగ్‌కు ముందు తమిళనాడు రాజకీయ చిత్రం ప్రధానంగా డీఎంకే-నేతృత్వంలోని కూటమి , అన్నాడీఎంకే, బీజేపీ కూటమి మధ్యే కేంద్రీకృతమైంది. విజయ్ తన పార్టీని స్థాపించినప్పటి నుండి ఎటువంటి కూటముల్లో చేరకుండా 234 నియోజకవర్గాల్లో ఒంటరిగా పోటీ చేస్తామని ప్రకటించారు. తమిళనాడు రాజకీయాల్లో గత 50 ఏళ్లుగా ఏదో ఒక ప్రధాన ద్రావిడ పార్టీతో కూటమి లేకుండా గెలవడం అసాధ్యమనేది చరిత్ర చెబుతున్న సత్యం. విజయ్ ఈ విషయాన్ని విస్మరించి, కేవలం తనకున్న స్టార్ ఇమేజ్ తోనే గట్టెక్కవచ్చని భావించడం ఆయనకు పెద్ద మైనస్ అయింది. క్షేత్రస్థాయిలో బూత్ కమిటీలు లేకపోవడం, జిల్లాల్లో బలమైన రెండో శ్రేణి నాయకత్వం కరువవ్వడం విజయ్ పార్టీని బలహీనపరుస్తోంది. విజయ్ ప్రధానంగా డీఎంకేని తన బద్ధశత్రువుగా ప్రకటించుకున్నారు. అయితే, విశ్లేషకుల ప్రకారం విజయ్ చీల్చే ఓట్లు ప్రతిపక్షమైన ంఎంఆఓఐ లేదా తటస్థ ఓటర్లవే అయ్యే అవకాశం ఉంది. దీనివల్ల ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోయి, అంతిమంగా ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌కే మేలు జరుగుతుందనే ప్రచారం జరుగుతోంది. విజయ్‌ను బి-టీమ్ గా చిత్రీకరించే ప్రయత్నం కూడా జరుగుతోంది, ఇది తటస్థ ఓటర్లలో సందిగ్ధతను పెంచుతోంది. కూటమిలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు వంటి బలమైన భాగస్వామ్య పక్షాలు ఉన్నాయి. అటు అన్నాడీఎంకే కూడా బీజేపీ, పీఎంకే , వంటి పార్టీలతో పటిష్టమైన పొత్తు కుదుర్చుకుంది. ఈ రెండు పెద్ద కూటముల మధ్య విజయ్ ఒక ఎక్స్ ఫ్యాక్టర్ గా మిగిలిపోయే ప్రమాదం కనిపిస్తోంది. విజయ్ కనీసం 15-20% ఓట్లు సాధించినా, అవి సీట్లుగా మారే అవకాశం తక్కువని, కేవలం కింగ్ మేకర్ కావాలని ఆయన ఆశించినా అది కూడా కష్టమేనని సర్వేలు చెబుతున్నాయి. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా విజయ్ కీలక రాష్ట్ర సమస్యలపై స్పష్టమైన వైఖరి తీసుకోలేదనే విమర్శలు ఉన్నాయి. కేవలం అవినీతి నిర్మూలన అనే సాధారణ నినాదంతో ఓట్లు పడవని, ప్రజలకు ఒక విజన్ చూపించడంలో ఆయన విఫలమయ్యారని తమిళ విశ్లేషకులు భావిస్తున్నారు. సెప్టెంబర్ 2025లో జరిగిన ఒక తొక్కిసలాట ఘటనపై సీబీఐ విచారణ వంటి చట్టపరమైన చిక్కులు కూడా ఆయన ప్రచార సమయాన్ని వృధా చేశాయి. విజయ్ సభలకు జనం విపరీతంగా వస్తున్నా, ఆ జనం ఓట్లుగా మారుతారా అనేది పెద్ద ప్రశ్న. ఎంజీఆర్, జయలలిత కాలం నాటి సినిమా గ్లామర్ పాలిటిక్స్ ఇప్పుడు పని చేయడం లేదు. విజయ్ తన రాజకీయ ప్రయాణాన్ని ఒక లాంగ్ టర్మ్ ' ప్రాజెక్టుగా భావిస్తే ఈ ఎన్నికలు ఆయనకు ఒక పాఠంలా మిగులుతాయి.

# వయసు కేవలం అంకె మాత్రమే

భోపాల్ : ప్రేమకు వయసుతో సంబంధం లేదని, మనసులు కలిస్తే చాలని మధ్యప్రదేశ్ హైకోర్టు మరోసారి స్పష్టం చేసింది. తనకంటే రెట్టింపు వయసున్న 40 ఏళ్ల వ్యక్తితో జీవించాలనుకున్న 19 ఏళ్ల యువతికి న్యాయస్థానం అండగా నిలిచింది. రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవిస్తూ, సదరు యువతి తన ఇష్టానుసారం తనకు నచ్చిన భాగస్వామితో కలిసి ఉండే పూర్తి హక్కు కలిగి ఉందని కోర్టు కీలక తీర్పునిచ్చింది. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ ప్రాంతానికి చెందిన 19 ఏళ్ల యువతి, అదే ప్రాంతానికి చెందిన 40 ఏళ్ల వ్యక్తితో ప్రేమలో పడింది. వీరిద్దరి మధ్య వయసు వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉండటంతో యువతి కుటుంబ సభ్యులు ఈ బంధాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. తన కుమార్తెను ఆ వ్యక్తి అపహరించి, మాయమాటలతో లొంగదీసుకున్నాడని ఆరోపిస్తూ యువతి తండ్రి కోర్టును ఆశ్రయించారు. తన కుమార్తెకు రక్షణ కల్పించి, ఆమెను తన వద్దకు చేర్చాలని కోరుతూ హేబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు, యువతిని ధర్మాసనం ముందు హాజరుపరచాలని ఆదేశించింది. కోర్టులో హాజరైన యువతి తన అభిప్రాయాన్ని ఎంతో స్పష్టంగా వెల్లడించింది. నేను మేజర్ ని, నా నిర్ణయాలు నేను తీసుకోగలను. 40 ఏళ్ల ఆ వ్యక్తితో నేను స్వచ్ఛందంగానే సహజీవనం చేస్తున్నాను. నన్ను ఎవరూ బలవంతం చేయలేదు, నేను నా ఇష్ట ప్రకారమే అతనితో వెళ్లాను అని ఆమె ధీమాగా చెప్పడంతో కేసు మలుపు తిరిగింది.

యువతి వాంగ్మూలాన్ని విన్న జస్టిస్ సునాయన దత్ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తికి తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కు ఉంది. భాగస్వామి వయసు ఎంత అనేది ఇక్కడ ప్రధానం కాదు. ఒక వ్యక్తి మేజర్ అయినప్పుడు, ఆమె ఎవరితో జీవించాలో నిర్ణయించే అధికారం తల్లిదండ్రులకు కానీ, సమాజానికి కానీ ఉండదు అని పేర్కొంటూ తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ తీర్పు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సామాజిక కట్టుబాట్లు, వయసు వ్యత్యాసాల కంటే వ్యక్తిగత స్వేచ్ఛ మరియు ప్రాథమిక హక్కులే అత్యున్నతమైనవని ఈ కేసు మరోసారి నిరూపించింది.

# శ్రీశైలం హైవే పై ఘోర రోడ్డు ప్రమాదం

రంగారెడ్డి : కందుకూరు ఎక్స్ రోడ్ లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం లో ఒకరు మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయివ. మయూరి చికెన్ వాహనం డిసియం టైర్ పగిలి అదుపుతప్పి ఎదురుగా హైదరాబాద్ నుంచి కందుకూరు వస్తున్న కారును కందుకూరు లీ రోడ్ నవారు బాల్ రెడ్డి ఫంక్షన్ హల్ వద్ద ఢీ కొట్టింది. కారులో ఒకే కుటుంబానికి చెందిన వారు వున్నారు. కారు నడుపుతున్న సురసాని భారత్ సింహ రెడ్డి అక్కడికి అక్కడే మృతి చెందారు. నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి.

# గ్రామ భద్రతకు సీసీ కెమెరాలే కవచం

మహబూబ్ నగర్ : గూడూరు పోలీస్ స్టేషన్ లో ఆకస్మిక తనిఖీ, పోనుగోడు గ్రామ సందర్శన గూడూరు పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ సందర్శించి సమగ్ర తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, గదులు, రికార్డుల నిర్వహణ, పని విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. స్టేషన్ సిబ్బంది సంఖ్య, విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతిపై ఎస్సై గిరిధర్ నుండి వివరాలు తెలుసుకున్నారు. అలాగే స్టేషన్ పరిధిలోని గ్రామాలు, గ్రామపంచాయతీలలో అమలు చేస్తున్న భద్రతా చర్యలపై సమగ్రంగా సమీక్షించారు. తరువాత ఎంపిక చేసిన గ్రామపంచాయతీ అయిన పోనుగోడు గ్రామాన్ని సందర్శించి, హెల్మెట్ వినియోగం అమలు, సీసీ కెమెరాల ఏర్పాటు మరియు పర్యవేక్షణ విధానాన్ని పరిశీలించారు. గ్రామస్థుల చొరవతో హెల్మెట్ వినియోగం కచ్చితంగా అమలవడం, గ్రామమంతా సీసీ కెమెరాల కవరేజీలో ఉంటున్నారు. గ్రామ భద్రతలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతి గ్రామం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండేలా చర్యలు తీసుకోవాలి. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ వినియోగం తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రజలు, పోలీస్ శాఖ కలిసి పనిచేస్తే గ్రామాలను నేర రహితంగా, సురక్షితంగా మార్చుకోవచ్చని అన్నారు.

# హత్య కేసులో 5 మందికి జీవిత ఖైదు

గూడూరు : గూడూరు రూరల్ పరిధిలోని చవట పాలెం గ్రామంలో 2020 సంవత్సరం జనవరి 5 వతేదిన మానసిక దివ్యాంగురాలు షేక్ పర్వీన్ ను అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటన చోటు చేసుకుంది. జనవరి 6 వ తేదీ 2020 లో గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగింది. ఈ ఘటనలో నిందితులైన దుగ్గన బోయిన సాయి శివ కుమార్ , గోవింద స్వామి వెంకటేష్, ము ద్దూరు శరత్, సుబ్రమల్లి వినోద్ కుమార్ , చల్లా కృష్ణయ్య లకు బుధవారం నెల్లూరు 8 వ జిల్లా న్యాయస్థానం 5 మందికి జీవిత ఖైదు మరియు ప్రతి నిందితుడు 6 వేల రూపాయలు జరిమానాను విధిస్తూ తీర్పు ను వెల్లడించింది.

# ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తేవాలి

### రహదారులు, భవనాలు, రవాణాశాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి : సచివాలయంలో రహదారులు, భవనాలు, రవాణాశాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో రహదారుల నిర్వహణ, పాత్ హోల్ ఫ్రీ రహదారులు, ఈవీ బస్సుల వినియోగం పై సమీక్షలో చర్చ జరిగింది. మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలో ఉన్న 45 వేల కిలోమీటర్ల పైచిలుకు రహదారులు నిర్వహణ పటిష్టంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారు. వివిధ ప్రాంతాల్లో భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేసి దాని ఆధారంగా రహదారుల నిర్మాణం జరగాలని సూచించారు,. మెరుగైన రహదారుల ద్వారా ప్రజలకు మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్ విజయానికి కృషి చేసిన పోలీస్ అధికారులకు ప్రశంసా పత్రాలు

జగిత్యాల : జిల్లాలో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు బార్ అసోసియేషన్ సభ్యులను జిల్లా జడ్జి రత్న పద్మావతి అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు. నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో జిల్లా పరిధిలో మొత్తం 3034 కేసులు పరిష్కారం కావడం జరిగింది. ఈ విజయానికి కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది, బార్ అసోసియేషన్ ప్రతినిధులను జిల్లా కోర్టు ప్రాంగణంలో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి రత్న పద్మావతి మాట్లాడుతూ, పోలీస్ అధికారులు, బార్ అసోసియేషన్, కోర్టు సిబ్బంది సమిష్టిగా కృషి చేసి కేసుల్లో ఉన్న కక్షిదారులను స్వయంగా కలిసి "రాజీ మార్గమే రాజమార్గం" అని అవగాహన కల్పించినందువల్లే ఈ స్థాయిలో కేసులు పరిష్కారం కావడం సాధ్యమైందన్నారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని, ఇరు వర్గాలకు న్యాయం చేకూరుతుందని తెలిపారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా భారీ స్థాయిలో కేసులు పరిష్కరించడంలో సమన్వయంతో పనిచేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు బార్ అసోసియేషన్ సభ్యులను అభినందిస్తూ, రానున్న రోజుల్లోనూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ , అదనపు జిల్లా జడ్జి నారాయణ, లీగల్ సెల్ సెక్రటరీ వెంకట మల్లిక్ సుబ్రమణ్య శర్మ, మేజిస్ట్రేట్ లు లావణ్య,నికిషా, డిఎస్పి రఘు చందర్, బార్ కౌన్సిల్ జగిత్యాల అధ్యక్షులు, అలాగే జిల్లా పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్దూరు లో పోలీసులు మీ కోసం కార్యక్రమం

సిరిసిల్ల : సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దురులో పోలీసులు మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు గంజాయి ,రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, గల్ఫ్ ఏజెంట్ ల మోసాలు, సైబర్ మోసాలు, బెట్టింగ్ యాప్స్ ,మహిళా చట్టాలు, షీ టీమ్, నూతన చట్టాలపై అవగాహన, సీసీ కెమెరాల యొక్క ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ ఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ మధ్యకాలం లో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. ఎవరైనా మోసపోయినట్లైతే 1930 నంబర్ కి పిర్యాదు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. సీసీ కెమెరాల వలన ఏ సంఘటన జరిగిన వెంటనే తెలుస్తోంది అని తెలిపారు. సిసి కెమెరాలు ఏర్పాటు సహకరించాలని కోరారు. వాహన దారులు తాగి డ్రైవింగ్ చేయవద్దని, లైసెన్స్ లేకుండ వాహనాలు నడపవద్దని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ఆవశ్యకత గురించి వివరించారు. అనుమాన స్పదంగా వ్యక్తులు కనపడితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. ఎలాంటి సమస్యలు వున్నా పోలీస్ స్టేషన్ కు తెలియపరచాలని తెలిపారు. ఏ సమ్యస వున్నా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో తెలపాలన్నారు, లేదా 100 నెంబర్ కు ఫోన్ చేస్తే నిమిషాల్లో పోలీసులు అక్కడికి చేరుకుంటారని అన్నారు.


# వృద్ధురాలి దారుణ హత్య

వికారాబాద్ : వికారాబాద్ జిల్లా కుల్కచర్ల లో అదృశ్యమైన వృద్ధురాలు అస్తిపంజరమై దొరికింది. పోలీసుల వివ రాల ప్రకారం.. మండలం లోని బండవెల్కిచర్లకు చెందిన వెంకటమ్మ(63) శనివారం ఇంటి నుంచి బ్యాంకుకు వెళ్లింది. సాయం త్రమైనా తిరిగిరాకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె కూతురు లక్ష్మి తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆది వారం కుల్కచర్ల పీఎస్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఆమె కాల్ లిస్ట్ ఆధారంగా పక్కింటి మహిళ మంజులను విచా రించగా తన భర్త భీమయ్యతో పాటు బంధువు బీరయ్యతో కలిసి చంపినట్లు తేలింది. వృద్ధురాలి ఒంటిపై ఉన్న బంగారం కోసం ఆమెను ద్విచక్ర వాహనం ఎక్కించుకుని తిర్మలాపూర్ గ్రామ సమీపంలోని పాండవుల బండపైకి తీసుకెళ్లి గొంతునులిమి చంపారు. అనంతరం పెట్రోల్ పోసి నిప్పంటించారని ఎస్ఐ రమేశ్ తెలిపారు.

# వరుణ్ ధావన్ ఫుల్ ఎనర్జీ.. మృణాల్‌తో కొత్త లుక్ వైరల్




బాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ వరుణ్ ధావన్, అందాల భామ మృణాల్ ఠాకూర్ కాంబినేషన్‌లో వస్తున్న 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' చిత్రంపై అంచనాలు పెరిగిపోతున్నాయి. తాజాగా సెట్స్ నుంచి లీక్ అయిన ఒక రొమాంటిక్ ఫోటో సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. వీరిద్దరి మధ్య ఉన్న కెమిస్ట్రీ ఫ్యాన్స్‌ను కట్టిపడేస్తోంది. డేవిడ్ ధావన్ మార్క్ కామెడీతో పాటు ఈ రొమాంటిక్ యాంగిల్ కూడా సినిమాలో హైలైట్ కాబోతోందని ఈ వైరల్ పిక్ చూస్తుంటే అర్థమవుతోంది. ఆ విశేషాలు చూద్దాం .. వరుణ్ ధావన్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఈ క్రమంలో చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక ఫోటో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఫోటోలో వరుణ్, మృణాల్ చాలా దగ్గరగా ఉంటూ రొమాంటిక్ పోజ్ ఇచ్చారు. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ అదిరిపోయిందని, స్క్రీన్ మీద ఈ జంట మ్యాజిక్ చేయడం ఖాయమని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. వరుణ్ తన ఎనర్జీతో, మృణాల్ తన అందంతో ఈ రొమాంటిక్ కామెడీకి కొత్త గ్లామర్ తీసుకొచ్చారు. ముందుగా ఈ సినిమాను జూన్ 5, 2026న విడుదల చేయాలని చిత్ర బృందం భావించింది. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ మూవీ విడుదల తేదీని జూన్ 12కి వాయిదా వేశారు. దీని వెనుక ఒక ఆసక్తికరమైన కారణం వినిపిస్తోంది. కన్నడ స్టార్ యష్ నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్' రిలీజ్ బరిలో ఉండటంతో, థియేటర్ల ఇబ్బంది కలగకుండా ఉండేందుకు వరుణ్ ధావన్ సినిమాను ఒక వారం వెనక్కి జరిపినట్లు తెలుస్తోంది. భారీ పోటీ మధ్య రావడం కంటే సోలోగా వచ్చి బాక్సాఫీస్‌ను కొల్లగొట్టాలన్నది మేకర్స్ ప్లాన్ లా కనిపిస్తోంది. ఈ సినిమాకు వరుణ్ ధావన్ తండ్రి, సీనియర్ డైరెక్టర్ డేవిడ్ ధావన్ దర్శకత్వం వహిస్తుండటం విశేషం. వీరిద్దరి కాంబోలో గతంలో వచ్చిన 'మెయిన్ తేరా హీరో', 'జుడ్వా 2' సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించాయి. ఇప్పుడు ఈ రొమాంటిక్ కామెడీతో హ్యాట్రిక్ కొట్టాలని తండ్రీకొడుకులు పట్టుదలతో ఉన్నారు. ఇక రమేష్ తౌరానీ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో పూజా హెగ్డే కూడా ఒక కీలక పాత్రలో నటిస్తుండటంతో సినిమాపై మరింత క్రేజ్ పెరిగింది. ఇద్దరు టాప్ హీరోయిన్లతో వరుణ్ చేసే అల్లరి ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ కానుంది. మొత్తానికి 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' సినిమా అప్డేట్స్ చూస్తుంటే బాలీవుడ్‌లో ఒక పక్కా వినోదాత్మక చిత్రం రాబోతోందని అర్థమవుతోంది. వరుణ్ ధావన్ తన ఫుల్ ఎనర్జీతో మరోసారి ఆడియన్స్‌ను కడుపుబ్బ నవ్వించడానికి సిద్ధమయ్యారు. ఇక మృణాల్‌తో ఆయన కెమిస్ట్రీ ఈ రొమాంటిక్ డ్రామాను ఏ స్థాయికి తీసుకెళ్తుందో చూడాలి. జూన్ 12న థియేటర్లలో ఈ హంగామా మొదలుకానుంది.



# రాశీ ఖన్నా స్టన్నింగ్ లుక్..

టాలీవుడ్ 'ఊహలు గుసగుసలాడే' భామ రాశీ ఖన్నా తన అందచందాలతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. సినిమాల్లో హిట్లు, ఫ్లాపులతో సంబంధం లేకుండా తన గ్లామర్‌తో కుర్రకారును కట్టిపడేస్తోంది. తాజాగా గ్రీన్ కలర్ మోడరన్ డ్రెస్సులో బ్యాక్ ఓపెన్ ఫోజులతో ఇంటర్నెట్‌కు సెగలు పుట్టించింది. అందం, అభినయం ఉన్నా అదృష్టం ఊరించని ఈ ఢిల్లీ బ్యూటీ, ప్రస్తుతం తన లేటెస్ట్ ఫొటోషూట్‌తో నెట్టింట వైరల్ అవుతోంది. రాశీ ఖన్నా స్టన్నింగ్ లుక్ చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. రాశీ ఖన్నా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి దాదాపు పుష్కర కాలం అవుతోంది. 'ఊహలు గుసగుసలాడే' సినిమాతో హోమ్లీగా పరిచయమై, ఆ తర్వాత జిల్, సుప్రీం, తొలిప్రేమ వంటి సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అందానికి అందం, నటనకు నటన ఉన్నా ఎందుకో ఈ అమ్మడికి అదృష్టం మాత్రం కలిసి రావడం లేదని చెప్పాలి. ఎన్టీఆర్ వంటి స్టార్ హీరోతో నటించినా, ఆమె కెరీర్ గ్రాఫ్ మాత్రం ఆశించిన స్థాయిలో పెరగలేదు. ఇక చాలా మంది నటీమణులలాగే రాశీ కూడా టాలెంట్ ఉండి కూడా సరైన బ్రేక్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది ఇండస్ట్రీలో రాణించాలంటే మచ్చ వేసుకునే పుట్టాలి అంటారు, రాశీ ఖన్నా విషయంలో అది నిజమనిపిస్తోంది. సెకండ్ గ్రేడ్ హీరోలతో చేసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద పెద్దగా ప్రభావం చూపలేదు. ప్రస్తుతం రాశీ ఖన్నా చేతిలో కొన్ని ప్రాజెక్టులు ఉన్నాయి. హిట్లు లేకపోయినా తన ఫాలోయింగ్‌ను మాత్రం పదిలంగా కాపాడుకుంటోంది. టాలీవుడ్ మేకర్స్ కూడా ఈ భామకు మరో అవకాశం ఇస్తే ఖచ్చితంగా ప్రూవ్ చేసుకుంటుందని అభిమానులు నమ్ముతున్నారు. వరుస ఫొటోషూట్‌లతో నిత్యం వార్తల్లో నిలుస్తూ తన ఉనికిని చాటుకుంటోంది. రానున్న రోజుల్లో వైవిధ్యమైన పాత్రలు ఎంచుకుని, బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటాలని రాశీ ఖన్నా భావిస్తోంది.



# యాంకర్ ఓవర్ యాక్షన్‌కు చెక్ పెట్టిన సల్మాన్ ఖాన్

బాలీవుడ్‌లో తాజాగా జరిగిన ఒక అవార్డు వేడుక చుట్టూ వివాదం చెలరేగింది. స్క్రీన్ అవార్డ్స్ 2026 సందర్భంగా ప్రముఖ కమెడియన్ రాజ్‌పాల్ యాదవ్‌పై యాంకర్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారి తీశాయి. ఈ పరిణామంలో స్టార్ హీరో సల్మాన్ ఖాన్ ఆయనకు బహిరంగంగా మద్దతు ప్రకటించడం హాట్ టాపిక్‌గా మారింది. ఈ అవార్డు వేడుకలో హోస్ట్ మాట్లాడుతూ రాజ్‌పాల్ యాదవ్ గతంలో ఎదుర్కొన్న చెక్ బౌన్స్ కేసును ప్రస్తావిస్తూ సెటైరికల్ వ్యాఖ్య చేశారు. డాలర్ రేటు పెరిగినా, తగ్గినా మీరు తీసుకున్న అప్పు మాత్రం అదే మొత్తంలో తిరిగి చెల్లించాలనే కామెంట్ ప్రేక్షకుల ముందే రావడంతో రాజ్‌పాల్ కొంత అసౌకర్యంగా కనిపించారు. ఈ కామెంట్స్ ఎంటర్టైన్మెంట్ కోసం చేసినవైనా, పర్సనల్ విషయాన్ని స్టేజ్ మీద ప్రస్తావించడం సరైంది కాదని నెటిజన్లు అభిప్రాయపడ్డారు. కాగా ఈ వివాదం చెలరేగిన వెంటనే సల్మాన్ ఖాన్ రియాక్ట్ అవడం విశేషం. తన సోషల్ మీడియా వేదికగా ఆయన రాజ్‌పాల్ యాదవ్‌కు మద్దతు తెలుపుతూ ఒక ఎమోషనల్ పోస్ట్ చేశారు. మీరు మూడు దశాబ్దాలుగా ఈ పరిశ్రమలో నిలబడటం మీ ప్రతిభకు నిదర్శనం. మీ పని మీద మాకు నమ్మకం ఉంది. అందుకే మిమ్మల్ని మళ్లీ మళ్లీ సినిమాల్లోకి తీసుకుంటున్నామంటూ ఆయన్ని ప్రశంసించారు. సల్మాన్ చేసిన పోస్ట్ లోని ఈ వ్యాఖ్యలు రాజ్‌పాల్‌కు పెద్ద మానసిక బలం ఇచ్చాయని చెప్పాలి. అదే సమయంలో డాలర్ రేటు గురించి వచ్చిన వ్యాఖ్యలపై కూడా సల్మాన్ ఖాన్ తనదైన శైలిలో స్పందించారు. డాలర్ పెరిగినా, తగ్గినా మనకు పెద్దగా సంబంధం లేదు. మనం పని చేసేది, తీసుకునేది అన్నీ ఇండియన్ కరెన్సీలోనే కదా అంటూ హాస్యాన్ని జోడిస్తూ పరిస్థితిని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఒక సీనియర్ నటుడి గౌరవాన్ని కాపాడే విధంగా ఆయన మాట్లాడిన తీరు ఇప్పుడు ఇండస్ట్రీలో ప్రశంసలు అందుకుంటోంది. ఇక ఈ ఘటనపై ప్రేక్షకుల రియాక్షన్ కూడా గట్టిగానే వచ్చింది. సోషల్ మీడియాలో చాలా మంది యాంకర్ కామెంట్స్ ను విమర్శిస్తూ, సీనియర్ నటుల పట్ల గౌరవం అవసరమని పేర్కొన్నారు. ఒకరి వ్యక్తిగత సమస్యలను వినోదంగా మార్చడం సరైన పద్ధతి కాదని పలువురు అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, రాజ్‌పాల్ యాదవ్ మాత్రం ఎంతో మెచ్యూరిటీతో స్పందించారు. సల్మాన్ ఖాన్ మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుతూ, తన ఫ్యాన్స్ ను యాంకర్‌పై విమర్శలు చేయవద్దని కోరారు. ఇలాంటి విషయాలు జరుగుతుంటాయని, వాటిని పెద్దగా తీసుకోవాల్సిన అవసరం లేదనే సందేశాన్నిచ్చారు. దీంతో ఆయన వ్యక్తిత్వం మరోసారి వెలుగులోకి వచ్చింది.

# మళ్లీ తెరపైకి గ్రేటర్ రాయలసీమ

కర్నూలు : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి ప్రాంతీయ వాదం తెరపైకి వచ్చింది. ఒకప్పుడు తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగిన టైమ్‌లోనే రాయలసీమ అస్తిత్వం అంటూ చర్చలు జరిగాయి. ఇప్పుడు గ్రేటర్ రాయలసీమ అంటూ మాజీమంత్రి మైసూరారెడ్డి మరోసారి స్లోగన్ అందుకున్నారు. నవ్యాంధ్రలో ఇప్పుడిప్పుడే రాజధాని వ్యవహారం ఒక కొలిక్కి వచ్చిందని అంతా అనుకుంటున్నారు. ఉమ్మడి ఏపీ నుంచి తెలంగాణా విడిపోయాక 2014 నుంచి 12 ఏళ్లుగా ఏపీ రాజధాని అంశం ప్రతి రోజు చర్చకు వస్తోంది. ఇప్పుడు అమరావతి రాజధానిగా పార్లమెంట్ ఉభయసభలు లైన్ క్లియర్ చేసినా..వైసీపీ మాత్రం మావిగన్ స్లోగన్ బలంగా వినిపిస్తోంది. ఏపీ రాజధానిగా అమరావతికి హోదా దక్కిందన్న సంతోషం దక్కిందో లేదో..వైసీపీ క్యాపిటల్ ఫైట్‌కు తెరలేపింది. సరే అది ఎప్పటికీ ఉండే ముచ్చటే అనుకుంటే..సీనియర్ రాజకీయ నేత మాజీమంత్రి మైసూరారెడ్డి ఒక బాంబు పేల్చారు. ఏపీలో రాజధాని పరిణామాలు, రాజకీయాలు చూస్తుంటే గ్రేటర్ రాయలసీమ ప్రత్యేక రాష్ట్రం తప్పదని అనిపిస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీలో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన సమయంలో ఆనాటి కేంద్ర ప్రభుత్వం నియమించిన శివరామకృష్ణన్ కమిషన్ చేసిన సిఫార్సులను గుర్తు చేశారు. అమరావతి ప్రాంతాన్ని కానీ విజయవాడ గుంటూరును కానీ రాజధానిగా ఎంపిక చేయొద్దని శివరామకృష్ణన్ కమిషన్ కీలక సూచనలు చేసిందంటున్నారు. దొనకొండ దగ్గర ఏకంగా 70 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కూడా కమిషన్ చెప్పిందన్నారు. అంతే కాదు రాజధాని నిర్మాణం కోసం వ్యవసాయ భూములను తీసుకోవద్దని ప్రైవేట్ భూములు అంతకంటే తీసుకోవద్దని కమిషన్ చెప్పిందంటున్నారు. కానీ 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పట్టుబట్టి మరీ వ్యవసాయ భూములు, పైగా ముంపు ప్రాంతం అయిన అమరావతిని ఎంపిక చేశారని మైసూరారెడ్డి విమర్శించారు. మావిగన్ పేరుతో జగన్ కొత్త ప్రతిపాదనలు చేయడం మరింత బాధాకరం అన్నారు. నాడు అమరావతికి ఓకే చెప్పి..ఆ తర్వాత మూడు రాజధానుల నినాదాన్ని ముందుకు తెచ్చారన్నారు. ఇప్పుడు మావిగాన్ అంటూ అర్థం పర్థం లేని మాటలు ఎందుకు అంటూ మండిపడ్డారు. శివరామ కృష్ణన్ కమిషన్ వద్దు అన్నచోటే ఈ ఇద్దరు నాయకులు రాజధాని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఈపాటికే గ్రేటర్ రాయలసీమ ఉద్యమాన్ని ప్రారంభించాల్సి ఉందని, వయసు కారణంగా ఆగిపోతున్నానని అంటున్నారు. కానీ రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై యువత స్పందించాలని వారు గ్రేటర్ రాయలసీమ నినాదంతో ఉద్యమించాలని మైసూరారెడ్డి పిలుపు ఇవ్వడం హాట్ టాపిక్‌గా మారింది. గ్రేటర్ రాయలసీమ డిమాండ్ కొత్తేమీ కాదు. ఏపీ, తెలంగాణ విభజన సమయంలో ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ రాయల తెలంగాణ కావాలని సోనియా గాంధీకి విన్నవించారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలను తెలంగాణతో కలిపితే అది ఒక బలమైన రాజకీయ శక్తిగా మారుతుందని ఆయన కోరారు. ఇక బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి లాంటి వాళ్లు ప్రత్యేక రాయలసీమ అంటూ దీక్షలు కూడా చేశారు. రాయలసీమ హక్కులు, నీళ్లు, నిధులు అంటూ కొన్నాళ్లు హడావుడి చేసి సైలెంట్ అయిపోయారు.

గ్రేటర్ రాయలసీమ అంటూ మైసూరారెడ్డితో పాటు గంగుల ప్రతాప్‌రెడ్డి వంటి నేతలు గతంలోనే తెరమీదకు తెచ్చారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటకంఒకప్పటి రాజధాని కర్నూలుతో పాటు మొత్తం రాయలసీమ ప్రాంతానికి ఇప్పటికీ అన్యాయం జరుగుతుందని చెబుతున్న నేతలు..కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకు దక్షిణ కోస్తా జిల్లాలైన నెల్లూరు, ఒంగోలు జిల్లాలను కలిపి గ్రేటర్ రాయలసీమ ప్రత్యేక రాష్ట్రం చేయాలన్నది వీరి ప్రధాన డిమాండ్. 2014లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు కూడా కొందరు సీమకు అన్యాయం జరుగుతోందని ఆందోళనలు చేపట్టారు.

కానీ, 2019 నుంచి 2024 వరకు జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ల కాలంలో ఈ గళం పూర్తిగా మూగబోయింది. ఆ సమయంలో రాయలసీమ గురించి ఏ ఒక్కరూ నోరు మెదపలేదు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా..ఓ వైపు అమరావతికి చట్టబద్ధత దక్కిన వేళ..గ్రేటర్ రాయలసీమ నినాదాన్ని పొలిటికల్ స్క్రీన్‌పైకి తేవడం ఆసక్తికరంగా మారింది.

# కూటమి ధీమా వెనుక కథేంటీ?

ఒంగోలు : ఏపీలో ఎన్నికలకు ఇంకా మూడేళ్ల టైమ్ ఉంది. కానీ రాబోయే ఎన్నికలపై ఇప్పటి నుంచే చర్చ జరుగుతోంది. కూటమి లాంగ్ లీవ్ అంటున్న చంద్రబాబు, పవన్.. వైసీపీ మళ్లీ రాదు గాక రాదు అని తెగేసి చెప్తున్నారు. వచ్చే టర్మే కాదు..రాబోయే 30ఏళ్ల వరకు కూడా వైసీపీకి అవకాశమే ఇవ్వము అన్నట్లుగా చెప్పుకొస్తున్నారు. థర్టీ ఇయర్స్ స్థిరమైన నాయకత్వం ఉండేలా ప్లాన్ చేస్తున్నామని అంటున్నారు సీఎ చంద్రబాబు. ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత, అసహనం కలిసి వస్తాయని వైసీపీ దింపుడు కళ్లం ఆశ పెట్టుకుని కూర్చుందని..అది జరగదని క్లియర్ కట్‌గా చెప్పేస్తున్నారు టీడీపీ అధినేత. గత ఎన్నికల కంటే కూటమి.. ఎస్పెషల్‌గా టీడీపీ మెరుగైన స్థానంలో ఉన్నట్లుగా చెప్పుకుంటున్నారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు చేసిన ఈ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చుట్టూ ఆసక్తికర చర్చ జరుగుతోందివైసీపీ మళ్లీ అధికారంలోకి రాదు. ఎలా పవర్‌లోకి వస్తారో చూస్తానంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రిపీటెడ్‌గా కామెంట్స్ చేస్తున్నారు. ఓ రకంగా వైసీపీకి ఛాలెంజ్ కూడా చేస్తున్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు కూడా సుత్తి లేకుండా సూటిగా చెప్పేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత కలిసి వస్తుందన్న ఆశలు వద్దు. మీకు ఆ ఛాన్స్ ఇవ్వం. అంత సీన్ కూడా లేదంటున్నారు. రాబోయే 30 ఏళ్ల పాటు స్థిరమైన నాయకత్వం ఉండేలా మాస్టర్ స్కెచ్ వేస్తున్నామని..అలా అయితే ఏపీ డెవలప్‌మెంట్ అన్‌స్టాపబుల్ అన్నట్లుగా పరుగులు పెడుతుందని చెప్తున్నారు. వైసీపీ హయాంలో జరిగిన విధ్వంసం నుంచి కోలుకోవడానికే సమయం పడుతుందని.. అలాంటిది ఏపీ మిగతా రాష్ట్రాలతో పోటీ పడేలా..దేశంలో అగ్రగామిగా నిలబడాలంటే..బలమైన, స్థిరమైన నాయకత్వం అవసరమని అంటున్నారుఅయితే ప్రభుత్వ వ్యతిరేకత మీదే వైసీపీ హోప్స్ పెట్టుకుందని ..కానీ అలా జరగనివ్వబోమని చెప్పడం ఇంట్రెస్టింగ్‌గా మారింది. బాబు ఇంత ఔట్ రైట్‌గా ఓ కామెంట్ చేయడం అంటే ఆశామాషీ కాదు. ఆయన థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీగా పాలిటిక్స్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చూసిన నాయకుడు. అలాంటి చంద్రబాబు తమ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత రాదు..రానివ్వమంటూ ధీమా వ్యక్తం చేయడం..ఇండైరెక్ట్‌గా ఫ్యాన్ పార్టీని ఛాలెంజ్ చేయడం పొలిటికల్ హాట్ టాపిక్‌గా మారిందఇంతకు బాబు ధైర్యం వెనుకున్న రహస్యం ఏంటన్నదే డిబేట్ పాయింట్ అవుతుంది. అధికారంలో ఉండి..పైగా ఇంకో మూడేళ్ల పాలన మిగిలి ఉండగానే..వైసీపీ ఎత్తులను పసిగట్టడం ఒక ఎత్తు అయితే..వైసీపీ పెట్టుకున్న ఆశలు అడిఆశలు అవుతాయని చెప్పడం మరో ఎత్తు. అయితే బాబు ఇంత కాన్ఫిడెంట్‌గా ఉండటానికి రీజనేంటి అన్నదే చర్చకు దారితీస్తోంది. నిజానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బాబు..చాలా జాగ్రత్త పడుతున్నారు. ఎక్కడా ప్రజా వ్యతిరేకత రాకుండా..ప్రతీ విషయంలో కేర్ తీసుకుంటున్నారు. ఎమ్మెల్యేల పనితీరు అయినా..అభివృద్ధి విషయంలో అయినా..సంక్షేమ పథకాలు అమలులో అయినా..రాజకీయ విమర్శల్లో కూడా ఎక్కడా చిన్న మిస్టేక్ జరగకుండా ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ప్రజా వ్యతిరేకత రాకుండా ప్లాన్ చేసుకోవడం ఒక ఎత్తు అయితే..ఎప్పటికప్పుడు ప్రజలు కూటమి ప్రభుత్వం గురించి ఏమనుకుంటున్నారు? ఏ విషయంలో అసంతృప్తిగా ఉన్నారని పబ్లిక్ పల్స్ తెలుసుకుంటున్నారు. పైగా సంక్షేమ పథకాల విషయంలో ఇచ్చిన మాట ప్రకారం ఒకదాని తర్వాత మరో హామీని అమలు చేసుకుంటూ వస్తున్నారు. ఇప్పటికే కీలక పథకాలన్నింటిని గ్రౌండ్ చేశారు. మిగిలిన చిన్న చితక హామీలేమైనా ఉంటే ఎన్నికల నాటికి అవి కూడా ఇంప్లిమెంట్ చేసే ఆలోచనలో ఉన్నారట. ఈ అన్ని విషయాలపై బేరీజు వేసుకుని..క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకున్నాకే చంద్రబాబు భరోసా పెరిగిందన్న టాక్ వినిపిస్తోంది. ఏదైనా వైసీపీని టార్గెట్ చేస్తూ టీడీపీ అధినేత చేసిన వ్యాఖ్యలు అయితే ఏపీ పాలిటిక్స్‌లో ఇంట్రెస్టింగ్ డిస్కషన్‌కు దారితీశాయి.

# బెదిరింపులతో సరేనా.... చర్యలకు దిగుతారా?

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో క్లీన్ పాలిటిక్స్ నినాదంతో వచ్చిన జనసేన పార్టీకి ఇప్పుడు తన సొంత ఎమ్మెల్యేల వ్యవహారశైలి పెద్ద సవాలుగా మారింది. 100 శాతం స్ట్రైక్ రేట్‌తో 21 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకున్న పవన్ కళ్యాణ్, ఇప్పుడు వారిపై వస్తున్న వరుస ఆరోపణలతో డిఫెన్స్‌లో పడాల్సి వస్తోంది. కొత్తగా ఎన్నికైన కొందరు ఎమ్మెల్యేల అతి ఉత్సాహం, వ్యక్తిగత వివాదాలు, ఆర్థిక ఆరోపణలు ఇబ్బందికరంగా మారుతున్నాయి. రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యక్తిగత వ్యవహారం ఇప్పుడు జనసేన పార్టీకి నైతిక సంక్షోభాన్ని తెచ్చిపెట్టింది. ఆయనపై వచ్చిన ఆరోపణలు, ఆపై బాధితురాలిపై జనసేన కార్యకర్తలు దాడికి పాల్పడ్డారన్న వార్తలు సోషల్ మీడియాలో దావానలంలా వ్యాపించాయి. హైకమాండ్ ఈ విషయంలో త్వరితగతిన స్పందించి కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల, క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్ అయోమయానికి గురవుతోంది. తప్పు చేస్తే సొంత వారినైనా వదలను అని చెప్పే పవన్ కళ్యాణ్, ఈ విషయంలో మౌనం వహించడం ప్రత్యర్థులకు ఆయుధంగా మారింది. విశాఖపట్నం శివారు నియోజకవర్గాల పరిధిలోని ఒక కీలక ఎమ్మెల్యేపై పారిశ్రామికవేత్తల నుండి, రియల్టర్ల నుండి భారీగా వసూళ్లు చేస్తున్నారనే ఫిర్యాదులు పవన్ కళ్యాణ్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం. ముఖ్యంగా భూ వివాదాల్లో తలదూర్చడం, సెటిల్మెంట్లు చేయడం వంటి పాత రాజకీయ వాసనలు జనసేన ఎమ్మెల్యేల నుంచి రావడం పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధం. అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే ఇలాంటి ఆర్థిక ఆరోపణలు రావడం భవిష్యత్తులో పార్టీ ఉనికికే ప్రమాదకరంగా మారవచ్చు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి చుట్టూ ఇప్పుడు మనీలాండరింగ్ ఆరోపణలు తిరుగుతున్నాయి. విచారణ సంస్థల వద్ద ఉన్న సమాచారం అంటూ వస్తున్న వార్తలు జనసేనను ఇరకాటంలోకి నెట్టాయి. ఒకవైపు పవన్ కళ్యాణ్ అవినీతి రహిత పాలన గురించి మాట్లాడుతుంటే, మరోవైపు కీలక మహిళా ఎమ్మెల్యేపై ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు రావడం పార్టీకి కొత్త సమస్యలను సృష్టిస్తోంది. జనసేన ఎమ్మెల్యేలలో అత్యధికులు రాజకీయాలకు కొత్త వారు కావడమే ఈ సమస్యలకు మూలమని భావిస్తున్నారు. తొలిసారి అధికారం దక్కడంతో, దానిని ఎలా నిర్వహించాలో తెలియక కొందరు అహంకారం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

అధికారులపై ఒత్తిడి తీసుకురావడం, నియోజకవర్గాల్లో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వల్ల కూటమిలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ నేతలతో కూడా ఘర్షణలు తలెత్తుతున్నాయి. ఈ అపరిపక్వత పవన్ కళ్యాణ్ కష్టపడి సంపాదించిన విశ్వసనీయత ను దెబ్బతీస్తోంది.

ఇటీవల పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా సమావేశమై, ప్రజల్లో వ్యతిరేకత వస్తే ఉపేక్షించేది లేదు అని ఘాటుగా హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది. ప్రతి ఎమ్మెల్యే పనితీరుపై రహస్యంగా సర్వేలు చేయిస్తున్నానని, అవినీతికి పాల్పడితే టికెట్లు ఉండవని కూడా స్పష్టం చేశారు.

జనసేన పార్టీ భవిష్యత్తు ఇప్పుడు పవన్ కళ్యాణ్ తీసుకునే కఠిన నిర్ణయాలపైనే ఆధారపడి ఉంది. కేవలం సలహాలు, సూచనలతో సరిపెట్టకుండా, వివాదాస్పద ఎమ్మెల్యేలను పక్కన పెట్టడం లేదా బాధ్యతల నుండి తప్పించడం వంటి చర్యలు తీసుకుంటేనే పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకం నిలుస్తుందని భావిస్తున్నారు.

# టిప్పు సూల్తాన్ సర్కిల్ వివాదం,.. మళ్లీ మొదటికి

కడప : రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడప నగరంలో టిప్పు సుల్తాన్ పేరుతో ఒక సర్కిల్‌ను ఏర్పాటు చేయాలని జరుగుతున్న ప్రయత్నాలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీస్తున్నాయి. భారత చరిత్రలో అత్యంత వివాదాస్పద వ్యక్తిగా ముద్రపడిన టిప్పు సుల్తాన్ పేరును ప్రజా ప్రదేశాలకు పెట్టడం సరికాదని పలు హిందూ సంఘాలు , భారతీయ జనతా పార్టీ గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ఆంధ్రప్రదేశ్‌లో ఇటువంటి చర్యలు మతపరమైన విభేదాలను సృష్టించే కుట్రలో భాగమని బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు. టిప్పు సుల్తాన్ తన పాలనలో హిందూ సమాజంపై దాడులు చేశారని, దేవాలయాలను ధ్వంసం చేయడమే కాకుండా వేలాది మందిని బలవంతంగా మతమార్పిడి చేశారని బిజెపి నాయకులు గుర్తు చేస్తున్నారు. అటువంటి వ్యక్తిని గొప్పగా చిత్రీకరించడం భావ్యం కాదని, ఇది స్థానిక ప్రజల సెంటిమెంట్లను గాయపరచడమేనని వారు వాదిస్తున్నారు. గతంలో ఇదే జిల్లాలోని ప్రొద్దుటూరులో కూడా ఇటువంటి ప్రయత్నం జరిగినప్పుడు, హిందూ సమాజం తిరుగుబాటుతో అది ఆగిపోయిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇటువంటి సున్నితమైన అంశాల్లో కఠినంగా వ్యవహరించాలని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను అడ్డుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. కావాలనే సమాజంలో చీలిక తెచ్చేందుకు కొందరు ఇటువంటి ప్రతిపాదనలను తెరపైకి తెస్తున్నారని, దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి శాంతిభద్రతలను కాపాడాలని బాధితులు , సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు. ఈ వివాదంతో, కడప మున్సిపల్ కమిషనర్ , జిల్లా కలెక్టర్ ఈ ప్రతిపాదనకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వకూడదని బిజెపి డిమాండ్ చేస్తోందది. స్థానిక ప్రజల మనోభావాలను గౌరవించాలని కోరుతోంది. టిప్పు సుల్తాన్ మద్దతుదారులు ఆయనను బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకగా పోరాడిన మొట్టమొదటి పాలకుల్లో ఒకరిగా చూస్తారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించిన మైసూరు పులి గా, దేశభక్తుడిగా ఆయనను గౌరవిస్తూ, ఆ జ్ఞాపకార్థం సర్కిల్‌కు ఆయన పేరు పెట్టాలని కోరుతుంటారు. కడప , ప్రొద్దుటూరు ప్రాంతాల్లో ముస్లిం జనాభా గణనీయంగా ఉంది. తమ సామాజిక వర్గానికి చెందిన ఒక చారిత్రక వీరుడి పేరును ఒక సర్కిల్‌కు పెట్టాలనేది

# గూగుల్ డేటా సెంటర్ కు శంకుస్థాపన

విశాఖపట్టణం : రాష్ట్రంలో ప్రతిష్టాత్మక గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. విశాఖపట్నం జిల్లాలో ఈ నెల 28వ తేదీన శంకుస్థాపన చేయనున్నారు. ఈ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ తో పాటు గూగుల్ సంస్థకు చెందిన ప్రముఖులు హాజరుకానున్నారు. అంతర్జాతీయ దిగ్గజ సంస్థ గూగుల్ అమెరికావెలుపల అత్యధిక పెట్టుబడి 15 బిలియన్ డాలర్ల (రూ.1.35 లక్షల కోట్లకు పైగా) వ్యయంతో చేపడుతున్న మొదటి ప్రాజెక్టు ఇదే కావడం విశేషం. వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ను నిర్మించనున్నారు. 2028 చివరికి డేటా సెంటర్ పనులు పూర్తి చేసి, ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెబుతున్నారు. గూగుల్ డేటా సెంటర్కు మూడు చోట్ల మొత్తం 601.4 ఎకరాలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. విశాఖ జిల్లా ఆనందపురం తర్లువాడలో 266.6 ఎకరాలు, విశాఖ గ్రామీణ మండలం అడవివరంలో సింహాచలం దేవస్థానానికి చెందిన 160 ఎకరాలు, అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఏపీఐఐసీకి చెందిన 174.8 ఎకరాలు కేటాయించారు. గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్, అదానీ(న్నాఫ్) భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నారుగూగుల్ సంస్థ ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్ల కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, గూగుల్ సంస్థ గత ఏడాది అక్టోబర్ 14న ఎంవోయూపై సంతకాలు చేశాయి. అవసరమైన భూమిని ప్రభుత్వం గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కు అప్పగించింది. మూడు డేటా సెంటర్ల ఏర్పాటుతో విశాఖపట్నం ఆసియాలోనే అతి పెద్ద డేటా సెంటర్ క్లస్టర్‌గా గుర్తింపు పొందే అవకాశం ఉంది. దీనికోసం 601.40 ఎకరాలను ప్రభుత్వం ఇప్పటికే కేటాయించింది. విశాఖపట్టణం తీర ప్రాంతం కావడంతో ఇక్కడి నుండి సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియా వంటి దేశాలకు సముద్రగర్భ కేబుల్ వ్యవస్థల ద్వారా నేరుగా అనుసంధానం ఏర్పడుతుంది. దీనివల్ల విశాఖ నగరం అంతర్జాతీయ డేటా కనెక్టివిటీ ప్రధాన కేంద్రంగా మారనుంది.

# విజయవాడ స్టేడియానికి మహర్ధశ

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం అంతర్జాతీయ హంగులు అద్దుకోబోతోంది. రాష్ట్రంలో క్రీడారంగానికి పూర్వవైభవం తీసుకురావాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఈ స్టేడియంను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పునరుద్ధరించాలని నిర్ణయించింది. విజయవాడ నగరాన్ని ఒక స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఇది మొదటి అడుగుగా ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఆధునీకరణ పనులకు సంబంధించి ఈ నెల 8వ తేదీన అధికారికంగా శంకుస్థాపన జరగనుంది. రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఈ కార్యక్రమానికి హాజరై పనులను ప్రారంభించనున్నారు. క్రీడాకారుల కోసం అత్యాధునిక వసతులు మరియు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ఈ భారీ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. పునరుద్ధరణలో భాగంగా స్టేడియంలో అత్యాధునిక రన్నింగ్ ట్రాక్స్, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఇండోర్, అవుట్ డోర్ కోర్టులు నిర్మించనున్నారు. శిక్షణలో ఉండే క్రీడాకారుల కోసం అధునాతన హాస్టల్ సౌకర్యాలు, జిమ్ మరియు ఇతర సాంకేతిక పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. భవిష్యత్తులో జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి ఈవెంట్లకు ఈ స్టేడియం వేదికగా మారనుంది. ప్రపంచ స్థాయి పోటీలకు సరిపడేలా స్టేడియం సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, ప్రతిభ ఉన్న క్రీడాకారులకు స్థానికంగానే అత్యుత్తమ శిక్షణ అందేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల బెజవాడ క్రీడాకారులు మరియు క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్టేడియం అభివృద్ధి కోసం ప్రభుత్వం మొత్తం రూ. 53 కోట్లు వెచ్చించనుంది. ఇందులో మొదటి విడతగా రూ. 30 కోట్లతో పనులను ప్రారంభించనున్నారు. 2027 నాటికి ఈ పనులన్నీ పూర్తి చేసి, 2029లో అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలను ఇక్కడ నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధాన స్టేడియం మధ్యలో 400 మీటర్ల పొడవైన, 8-లేన్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న శాప్ ప్రధాన కార్యాలయాన్ని తొలగించి, ఆ స్థానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను నిర్మించనున్నారు. టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ మరియు కబడ్డీ కోసం అదనంగా కొత్త ఔట్‌డోర్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు.

# విశాఖ టూ మావిగన్

శ్రీకాకుళం : రాజధానుల విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఒక స్టాండ్ అంటూ లేకుండా పోతోంది. మొన్నటి వరకు మూడు రాజధానులు అన్న జగన్మోహన్ రెడ్డి మావిగన్ ప్రతిపాదన తీసుకొచ్చారు. మచిలీపట్నం- విజయవాడ- గుంటూరును కలుపుతూ మావిగన్ రాజధాని ఏర్పాటు చేయాలని ప్రత్యామ్నాయం సూచించారు. దాదాపు అమరావతి రాజధానికి దగ్గరగానే ఆయన సూచనలు ఉన్నాయి. కానీ ఇన్ని పరిణామాలు జరిగిన తర్వాత జగన్మోహన్ రెడ్డి ఈ మాట చెప్పడమే విమర్శలకు తావిస్తోంది. చంద్రబాబు అమరావతి ప్రతిపాదన చేసినప్పుడే ఈ మావిగన్ సూచించి ఉంటే బాగుండేది. పోనీ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానులు అనేకంటే.. ఈ మావిగన్ ప్రతిపాదన చేసి ఉంటే బాగుండేది. కానీ ఇప్పుడు ఆ ప్రతిపాదన చేస్తుండడం మాత్రం ఇబ్బందికరంగా మారింది. అనవసరంగా ఆయన టార్గెట్ అవుతూ వస్తున్నారు. ఒకవైపు మావిగన్ ప్రతిపాదన చేయగా.. ఇంకోవైపు ధర్మాన లాంటి సీనియర్ నేత వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ అన్యాయం గురించి ప్రశ్నిస్తున్నారు. నిన్నటి వరకు ఇదే ధర్మాన మేధావి ఉత్తరాంధ్రకు రాజధాని ప్రకటించడాన్ని హర్షించారు. విశాఖ పాలన రాజధానిని ఆహ్వానించారు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో ఊరువాడ ప్రచారం చేశారు. కానీ ఇప్పుడు ఆయన జగన్మోహన్ రెడ్డిని ఏం అనడం లేదు. ఆది నుంచి చంద్రబాబు స్టాండ్ అమరావతి. ఆయన మాట మార్చలేదు. కానీ మూడు రాజధానుల్లో భాగంగా విశాఖను పాలన రాజధాని చేస్తానన్నా రు జగన్. దానిని విస్తృతంగా ప్రచారం చేశారు ధర్మాన. 2024 ఎన్నికలకు ముందు ఈ సీనియర్ నేత తన సొంత నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో దీనిపైనే డిబేట్ పెట్టారు. ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. కానీ ఇప్పుడు జగన్ మూడు రాజధానుల నుంచి మావిగన్ వైపు వెళ్తే దాని గురించి పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ఉత్తరాంధ్రకు అన్యాయం జరిగింది అంటే అది జగన్మోహన్ రెడ్డి చేసినట్టే. జగన్మోహన్ రెడ్డి ఉత్తరాంధ్రలోని విశాఖను పాలనా రాజధానిగా ప్రకటించారు. దానిని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు ధర్మాన. ఇప్పుడు అదే జగన్ విశాఖ కాదు మావిగన్ అంటున్నాడు. కానీ ధర్మాన జగన్మోహన్ రెడ్డిని విడిచిపెట్టి చంద్రబాబును టార్గెట్ చేస్తున్నారు. ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమ వెనుకబడిన ప్రాంతమని.. విభజన చట్టమే చెప్పిందని.. 80 ఏళ్ల వయసులో కూడా ఉత్తరాంధ్ర ప్రజలు పొట్ట చేత పట్టుకుని వలస వెళ్తున్నారని.. రాయలసీమ బిడ్డగా ఉండి ఆ ప్రాంత అభివృద్ధికి చంద్రబాబు ఏం చేశారని నిలదీస్తున్నారు ధర్మాన. కానీ విశాఖ పాలన రాజధానిగా ప్రకటించి.. దాని నుంచి పక్కకు తప్పుకుంటున్న జగన్మోహన్ రెడ్డిని మాత్రం ఏమీ అనడం లేదు. అందుకే ధర్మాన అపరమేధావి అయ్యారు. శ్రీకాకుళం జిల్లా ప్రజలు నమ్మలేని స్థితికి చేరుకున్నారు.

# ఎందుకు జూన్ 2024 తీసుకున్నారు...

విజయవాడ : ఏపీప్రజల ఆకాంక్ష నెరవేరింది. రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత లభించింది. ఏపీ ఏకైక రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ.. ఏపీ పునర్విభజన చట్టం 2014 సవరిస్తూ తీసుకొచ్చిన బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేయగా.. న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2024 జూన్ రెండు నుంచి ఏపీ రాజధానిగా అమరావతిని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. అమరావతి గెజిట్ నోటిఫికేషన్ లో 2024 జూన్ రెండు నుంచి రాజధానిగా గుర్తించినట్టు పేర్కొనడంపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. అదే తేదీ నుంచి ఎందుకు అని సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. 2014లో రాష్ట్ర విభజన జరిగింది. ఉమ్మడి ఏపీకి హైదరాబాద్ రాజధానిగా ఉండేది. అయితే విభజన తర్వాత కూడా అంటే 2014 నుంచి 2024 వరకు పదేళ్లపాటు రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ను ఉంచారు. అయితే ఆ గడువు 2024 జూన్ 2 తో ముగిసింది. ఈ క్రమంలోనే 2024 జూన్ రెండు నుంచి అమరావతి ఏకైక రాజధానిగా పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. అయితే ఈ నిర్ణయం వెనుక రెండు కారణాలు ఉన్నాయి. ఉమ్మడి రాజధానిగా హైదరాబాదుకు ఇచ్చిన గడువు ముగియడం ఒకటి అయితే.. మూడు రాజధానుల ఎపిసోడ్ కు చెక్ పెడుతూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు అయింది. రాబోయే రోజుల్లో ఎలాంటి వివాదాలు లేకుండా చట్ట సవరణపై స్పష్టత ఇచ్చారు. ఒకవేళ భవిష్యత్తులో రాజధాని అమరావతి ఏవైనా మార్పులు, చేర్పులు చేయాలంటే పార్లమెంటుకు మాత్రమే అధికారం కట్టబెట్టారు. శాసనసభలో సవరణ చేసి మార్పు చేస్తామంటే కుదిరే పని కాదు. అయితే అంతా మూడు రాజధానులకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతోనే అమరావతికి చట్టబద్ధత కల్పించారని భావించారు.

కానీ ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ కు ఉన్న గడువు ముగిడంతోనే ఈ కీలక నిర్ణయం తీసుకున్నారన్న విషయం చాలామందికి తెలియదు. ఎంతవరకు మూడు రాజధానులకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతోనే.. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అనుకున్నారు. కానీ 2024 జూన్ 2 తో హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు ముగిసిందని కేవలం కొద్ది మందికి మాత్రమే తెలుసు.

# అంతర్జాతీయ హోటల్ గా రుషికొండ

విశాఖపట్టణం : రుషికొండ భవనాల అదృష్టం త్వరలో మారబోతోంది. ఈ ప్యాలెస్‌ను ఏ విధంగా ఉపయోగించుకోవాలనే అంశంపై కేబినెట్ సబ్ కమిటీ కసరత్తును ముగించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, ఈ భవనాలను ప్రజాధనానికి భారంగా కాకుండా, ప్రభుత్వానికి ఆదాయం తెచ్చే వనరుగా మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 10న జరగనున్న రాష్ట్ర కేబినెట్ సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకుని, అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది. గతంలో రుషికొండపై ఉన్న హరిత రిసార్ట్స్ ద్వారా ప్రభుత్వానికి ఏడాదికి సుమారు 7 కోట్ల రూపాయల ఆదాయం వచ్చేది. కానీ ప్రస్తుతం నిర్మించిన ప్యాలెస్ నిర్వహణకే నెలకు 25 లక్షల రూపాయల వరకు ఖర్చవుతోంది.

విద్యుత్ ఛార్జీలు, ఇతర నిర్వహణ ఖర్చులు కలిపి ఏడాదికి 3 కోట్లకు పైగా ప్రజాధనం ఖర్చవుతుండటంతో, ప్రభుత్వం దీనిని ప్రోపర్ యుటిలైజేషన్ చేయాలని నిర్ణయించింది. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, సుమారు 1517 మంది నుంచి సేకరించిన సూచనల ఆధారంగా ప్రభుత్వం ఒక ప్రణాళికను రూపొందించింది. రుషికొండ ప్యాలెస్ నిర్వహణకు ప్రపంచస్థాయి గుర్తింపు ఉన్న తాజ్ గ్రూప్, ఎట్మాస్పియర్ కోర్, లీలా, ఫెమా వంటి నాలుగు ప్రముఖ సంస్థలు ఆసక్తి కనబరిచాయి.

Printed, Published and Owned by **B.PRAMOD KUMAR**, B-258, Phase-1, Vanasthalipuram, Hyderabad-70. Printed at **Garuda Printers**, H.No :2-86/1, Plot No. 23 -SP, Sy.No.417, Sagar High Way. Ragannaguda Village, Abdullapurmet (M), Rangareddy Dist, Telangana State- 501510 , **Published at :** H.No.Plot no.1, Bhagya laxmi Towers, opp: GHMC, L.B.Nagar Circle, venkateswara Colony, Saroornagar, Ranga Reddy Dist. Hyderabad-500035,Telangana State, **Editor :B. Pramod Kumar**, **RNI No: TELTEL/2021/81803**